# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45 సంచిక : 6 విజయవాడ 20-7-2012 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- గుత్తాధిపత్యంతో నిలువుదోపిడీ సాగిస్తున్న సిమెంటు పరిశ్రమాధిపతులు
- వివిధ దేశాలలో మోన్‌శాంటో ఉత్పత్తుల దుష్ఫలితాలు–ప్రజల వ్యతిరేకత
- ఆర్‌టిసి నష్టాలకు కారకులెవరు?
- నీతిబాహ్య ఔషధ ప్రయోగాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘ నివేదిక


### ప్రముఖ విప్లవ కమ్యూనిస్టు యోధుడు

## కా॥ తరిమెల నాగిరెడ్డి చూపించిన విప్లవపంథాలో పయనిద్దాం



**మన** దేశానికి స్వతంత్రం వచ్చిందని చెప్పబడిన తరువాత 65 సంవత్సరాల కాలం గడిచిపోయింది. ఈ 65 సంవత్సరాల కాలం లోనూ దేశం అభివృద్ధి చెందకపోగా, దేశప్రజల స్థితిగతులు మెరుగు పడకపోగా, దేశంలోని అన్నిరంగాలూ విధ్వంసమయ్యాయి. దేశ ప్రజల స్థితిగతులు మరింత దారుణంగా తయారయ్యాయి. దేశప్రజల జీవితాలు దుర్భరమయ్యాయి. దేశంలో పేదరికం తాండవిస్తోంది. ప్రజలకు ఉపాధి దొరకక నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చింది. దేశ ప్రజల జీవన ప్రమాణాలలో నాణ్యత పూర్తిగా దిగజారిపోయింది. ప్రజలమధ్య అసమానతలు మరింతగా పెరిగిపోయాయి. ప్రజల్లో నిరక్షరాస్యత, పోషకాహారలేమి, అనారోగ్య సమస్యలు అనూహ్య స్థాయికి పెరిగిపోయాయి. అనుక్షణం తారాస్థాయికి పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలను అధఃపాతాళంలోకి నెట్టివేస్తున్నాయి.

ఒక 'స్వతంత్ర' దేశంలో, నాటి జాతీయ స్వాతంత్ర్య పోరాటానికి తిరుగులేని నాయకత్వం వహించిందని చెప్పబడుతున్న, నాటి జాతీయ కాంగ్రెస్‌పార్టీ యొక్క వారసులనబడేవారే ఎక్కువకాలం మేరకు పరిపాలించిన మనదేశంయొక్కస్థితి యిలాఎందుకు దిగజారి పోయింది అన్నదే నేడు అర్థంచేసుకోవల్సిన కర్తవ్యంగా మనందరిపైనా వుంది.

మనదేశ పరిస్థితి యిటువంటి దుస్థితికే చేరుకోబోతోందని 40 సంవత్సరాలకు పూర్వమే ప్రముఖ విప్లవయోధుడు, మార్క్సిస్టు మేధావి, కమ్యూనిస్టు విప్లవనేత కా॥తరిమెల నాగిరెడ్డి, తన ప్రసిద్ధ కోర్టు ప్రకటన 'తాకట్టులో భారతదేశం' ద్వారా భారత జాతిని హెచ్చరించారు. తన ప్రకటన కాలం దాకా సాగిన 25 సంవత్సరాల, 'దేశీయ' పాలకుల పాలనలోని విధానాలను, ప్రత్యేకించి భారత పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను శాస్త్రీయంగా పరిశీలించి, విశ్లేషించి వాటిని దేశప్రజల జీవితానుభవంతో బేరీజువేసి, భారత వ్యవస్థను సమగ్రంగా మదింపుచేసి తిరుగులేని, నిత్యసత్యమయిన నిర్ధారణలను ఆయన చేశారు. ఆ నిర్ధారణల ఆధారంగా దేశ అభివృద్ధి రాను రాను నిస్సందేహంగా దిగజారిపోతుందనీ, దేశప్రజల స్థితిగతులు మరింతగా దుర్భరం కాబోతున్నాయనే అంచనాను ఆయన దేశప్రజల ముందుంచారు.

మనకు 1947 ఆగస్టు 15న వచ్చినది స్వతంత్రంకాదనీ, జరిగినది కేవలం అధికారమార్పిడి మాత్రమేననీ, ఆ అధికార మార్పిడి కూడా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అంతవరకూ జరుపుతూ వచ్చిన దోపిడీని పదిలపరచుకొంటూ, భారత దళారీ పాలకవర్గాలతో ఒప్పందం చేసుకొన్న తర్వాత, భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదంతో నీచమైన రాజీపడిన తర్వాత మాత్రమే జరిగిందనీ, అధికార మార్పిడి అనంతరం దేశపాలనను చేబట్టిన దళారీ పాలకులు తమ ఆర్థిక విధానా లన్నింటినీ విదేశీ పెట్టుబడి దోపిడీ ప్రయోజనాలకు లోబడి మాత్రమే రూపొందించారనీ, ఫలితంగా దేశం పరాధీనమయి పోతోందనీ, మనదేశపు సహజసంపదనూ, వనరులనూ దశాబ్దాల రాబోయే కాలంమేరకు నిస్సిగ్గుగా అమ్మకం పెట్టారనీ ఈ కారణాలన్నింటి రీత్యా రానురాను దేశపరిస్థితులు, ప్రజల స్థితిగతులు ఘోరంగా దిగజారిపోతాయని ఆయన హెచ్చరించారు. ఇటువంటి సిగ్గుచేటైన స్థితిగతులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాల్సిన తప్పనిసరి పరిస్థితి ప్రతీ దేశభక్తుడికీ ఏర్పడిందని ఆయన నిర్ద్వంద్వంగా ప్రకటించారు. స్వతంత్రమైన, స్థిరమైన, విశ్వసనీయమైన పునాదులుగల ప్రజాతంత్ర వ్యవస్థను దేశంలో నెలకొల్పటానికి అవసరమయిన జనతాప్రజాతంత్ర విప్లవ పోరాటాన్ని చేపట్టాల్సిందిగా పిలుపునిచ్చారు. పూర్తికాబడని జాతీయ విమోచనోద్యమ పోరాటాన్ని మరింత ధృడనిశ్చయంతో, మరింత శక్తితో కొనసాగించాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

కా॥తరిమెల నాగిరెడ్డి మరణానంతరపు ఈ 36 సంవత్సరాల కాలంలోనూ, ఆయన భారతదేశ వ్యవస్థపై, పాలకవర్గాలపై, పాలకులపై, వారి ప్రజావ్యతిరేక విధానాలపై, అవి దేశంలో సృష్టిస్తున్న, సృష్టించబోయే విధ్వంసకర పరిణామాలపై చేసిన నిర్ధారణలు, అంచనాలూ అక్షరసత్యాలుగా నిరూపితమయ్యాయి.

భారత పాలకులు, పాలకవర్గాలూ సామ్రాజ్యవాద నిర్దేశిత నయాఉదారవాద అభివృద్ధి పద్ధతి అనేదాన్ని చేబట్టి అమలు జరపటంతో, దేశం అతిత్వరితంగా దుస్థితిలోకి కూరుకుపోయింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి దేశంలోని అన్నిరంగాలలోకీ చొచ్చుకువచ్చింది. విదేశీ పెట్టుబడికి భూమి, నీరు, ఆర్థిక వనరులూ ధారాదత్తం చేయబడ్డాయి. భారతదేశపు మార్కెట్లూ, ఆర్థిక వనరులూ విదేశీ సామ్రాజ్యవాద పెట్టుబడికి స్వాధీనం చేయబడ్డాయి. అభివృద్ధి సాధిస్తాం అనే సాకుతో భారత దళారీ పాలకులూ, పాలకవర్గాలూ ఈ సామ్రాజ్యవాదానికి తాము అమ్ముడుబోవటమేకాక, ఈ నయాఉదారవాద ఆర్థిక విధానాల అమలుద్వారా దేశాన్నే విదేశీ పెట్టుబడికి అమ్మివేశారు. దీని పర్యవసానమే ఈనాడు దేశంలోని అన్నిరంగాల్లోనూ జరిగిన విధ్వంసం–దేశప్రజల జీవన పరిస్థితుల్లో సంభవించిన దుర్భరత. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానంయొక్క సంక్షోభాన్ని, దేశంలోని సామాన్య ప్రజలు ప్రత్యేకించి కార్మికులు, చిన్న –సన్నకారు రైతాంగం, గ్రామీణపేదలు, పట్టణపేదలు బలవంతంగా భరించాల్సిరావటంవల్లనే దేశప్రజల జీవితాలు ఛిద్రమయ్యాయి. ప్రత్యేకించి సెజ్‌లనూ, పరిశ్రమల అవసరాలకూ, రియలెస్టేటు అవసరాలకూ రైతాంగపు భూమిని బలవంతంగా లాక్కోవటం అనే పరిస్థితివలన గ్రామీణ ప్రజానీకపు జీవితాలు ధ్వంసం చేయబడ్డాయి. మరోవైపు విదేశీ– స్వదేశీ బడాపరిశ్రమల అవసరాలకోసం–వారికి కట్టబెట్టిన ఖనిజాలైన ఇనుము, బాక్సైటు, రాగి, బొగ్గులాంటి ఖనిజాల త్రవ్వకంకోసం–బడా ప్రాజెక్టుల నిర్మాణంకోసం దేశంలోని కోట్లాదిమంది గిరిజనులు నిర్వాసితులుగా చేయబడ్డారు. వీరు ఉపాధిని, తమ సహజ ఆశ్రయాలను కోల్పోయి, బలవంతుల– పోలీసుల నిరంతర దాడులను ఎదుర్కొంటూ, తమ జీవితాలు ఛిద్రమై భిక్షకులకన్నా అధమ స్థాయిలో జీవించాల్సిన దుస్థితిలోకి నెట్టబడ్డారు.

ఈ రకంగా నేడు మనదేశంలోని కార్మికులు తమ కనీస హక్కులకోసం, వ్యవసాయంపై ఆధారపడిన చిన్న–సన్నకారు రైతాంగం తమకున్న కొద్దిపాటి భూములను పరిరక్షించుకోవటం కోసం, వ్యవసాయరంగంపై ఆధారపడిన శ్రామికులు Z

Z తమ జీవనోపాధిని సాధించుకోవటం కోసం, దళిత వర్గాలవర్గాలు సామాజిక అసమానతలను తొలగించుకోవటంకోసం, గిరిజనులు తమ భూమి, నీరు, అడవులు, సహజ ఆవాసాలను పరిరక్షించుకోవటంకోసం, దేశంలోని సామాన్య ప్రజలూ, మధ్యతరగతి వర్గాలవారూ అనుక్షణం పెరగుతున్న నిత్యావసరవస్తువుల, ఆహార పదార్థాల, సేవల ధరలను తగ్గించుకోవటంకోసం, రోజురోజుకూ హరింపబడుతున్న తమ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించుకోవటంకోసం అనివార్యంగానే పోరాడవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అయితే యీ సెక్షన్ల ప్రజలందరిని ఐక్యపరచి, వారి పోరాటాలను సమన్వయపరచి ఒక సరైన దిశానిర్దేశంతో నిర్వహించగలిగినపుడే అవి సత్ఫలితాలను పొందగలుగుతాయి. కాని పక్షంలో భారత దళారీ పాలకుల, పాలకవర్గాల కుయుక్తులు, కుట్రలు, దమన నీతికి బలయిపోతాయి. అందువలన దేశప్రజల పోరాటాలను ఒక సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత విప్లవ కమ్యూనిస్టులపైన వుంది. అందుకు అవసరమయిన సక్రమమయిన విప్లవపంథాను కా॥తరిమెల నాగిరెడ్డి ఎన్నడో సూచించారు.

"పట్టువిడుపూగల ఎత్తుగడలతో, రైతాంగ సాయుధ పోరాటం ప్రధాన పోరాటంగా, వివిధ పోరాట రూపాలను అనుసరిస్తూ, భారత జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని సాగించటం" అన్నదే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి సూచించిన విప్లవపంథా.

రాబోయే శతాబ్దాల కాలంవరకూ దేశంలోని సహజ వనరులన్నింటినీ, దేశసర్వస్వాన్నీ విదేశీ పెట్టుబడికి, విదేశీ దోపిడీదారులకు అమ్మివేసిన నేటి భారత పాలకవ్యవస్థను కూలద్రోసి, ఆ స్థానంలో నిజమైన జనతా ప్రజాతంత్ర వ్యవస్థను స్థాపించటంకోసం అంటే పూర్తికాకుండా వదలివేయబడ్డ భారత జాతీయ విమోచనా పోరాటాన్ని మరింత ధృడనిశ్చయంతో, మరింత పట్టుదలతో కొనసాగించాలన్నదే ఆ కామ్రేడ్ ప్రకటించిన విప్లవపంథాయొక్క సారాంశం.

ఇటువంటి చారిత్రక కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో, నిబద్ధతతో కొనసాగించటానికి తిరిగి ప్రతిన బూనటమే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డికి మనం అర్పించే అర్థవంతమయిన నివాళి అవుతుంది. అందుకు పూనుకొందాం! విప్లవ విజయం తథ్యం!! ✡

సంపాదకీయం

## ప్రజా జీవనాన్ని మరింత కల్లోల భరితంచేసే చర్యలకు పునాది

చర్చను ప్రధాని మన్మోహన్‌సింగ్ మొదలు పెట్టారు. వృద్ధిరేటు క్షీణిస్తున్నదని ఆందోళన వ్యక్తంచేస్తూ విదేశాలనుండి పెట్టుబడుల మదుపును ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వ విధానాలను సమర్థించే ఆర్థికవేత్తలు దీనికనుగుణంగా విశ్లేషణలు మొదలుపెట్టారు. విదేశీ పెట్టుబడుల మదుపును సరళీకరించకుంటే ఆర్థిక మాంద్యంలో కూరుకుపోతామని హెచ్చరికలు మొదలుపెట్టారు. భారత బడా బూర్జువాల సంస్థ ఫిక్కి మరో అడుగు ముందుకువేసి కిరాణా వ్యాపారంతో సహా ఏఏ రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను అనుమతించాలో ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. ఇక సామ్రాజ్యవాదులు అందుకున్నారు. టైమ్స్ పత్రిక మన్మోహన్‌సింగ్‌ను సంస్కరణలను అమలుచేయటంలో విఫలమైనవాడిగా వర్ణించింది. సంస్కరణలంటే నీళ్లు నమలకుండా విదేశీ పెట్టుబడికి గేట్లు బార్లాతెరవటమేనని స్పష్టంచేసింది. ఇక సామ్రాజ్యవాద అధినాయకుడు ఒబామా రంగంలోకి దిగాడు. భారత్ త్వరితగతిన సంస్కరణలను అమలు జరపాల్సిందేనన్నాడు.

వీరందరూ ఆందోళన చెందుతున్నది, తమ లాభాల పెరుగుదల తగినంతగా లేదనే. ఎలాంటి ఆంక్షలూ లేకుండా సూపర్ లాభాలు పిండుకునేందుకు అన్ని అవకాశాలూ కల్పించమనే. ఆర్థిక మాంద్యత కారణంగా ప్రజల బ్రతుకులు కష్టాల కొలిమిలో కాగుతున్నా వారికి పట్టదు. ప్రజలందరూ ఐస్‌క్రీములు తింటున్నవారిగా కన్పిస్తున్నారు. ఐస్‌క్రీము ధర ఎంత పెరిగినా పట్టించుకోనివారు, బియ్యం ధర రూపాయి పెరిగితే రోడ్డెందుకెక్కుతున్నారో అర్థంకాని స్థితిలో వున్నారు. ఐస్‌క్రీముల అమ్మకాలతో కంపెనీకి లాభాలు పెరిగాయా లేదా అన్న విషయం మాత్రం వారికి అర్థమౌతుంది. ఆ లాభాలు తగ్గితే పిల్లలకు పౌష్టికాహారం పేరిట మధ్నాహ్న భోజన పథకంలో ఐస్‌క్రీమును చేర్చటానికి కూడా వారు సిద్ధమే. నూతన ఆర్థిక విధానాల అమలులో భాగంగా వ్యవసాయరంగాన్ని కునారిల్లజేశారు. ఉత్పాదకాల ధరలన్నీ పెంచివేసీ, పంటలకు న్యాయమైన ధర యివ్వకుండా రైతాంగాన్ని నిలువుదోపిడీ చేశారు. ఫలితంగా రైతాంగం ఆదాయం తగ్గిపోయింది. సాగుచేయలేక, ఇతర కారణాలతో భూమినుండి తొలగించినందున భూమిలేని గ్రామీణ జనాభా పెరిగారు. వ్యవసాయ కూలీలకు పనిదినాలు తగ్గాయి. ఫలితంగా 70శాతం జనాభా కొనుగోలుశక్తి క్షీణించిపోయింది. దీనితోపాటు ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని పెంచే విధానాలను అమలుజరిపింది. ధనాఢ్యవర్గాల విలాసాలను తీర్చే సరుకుల అమ్మకాలు పెంచేందుకు రుణాలిస్తూ ద్రవ్య చలామణీ పెంచుతున్నారు. మరోవైపున 40 రూ॥ విలువగల ఆస్థి ఏర్పడటానికి 100 రూ॥లు వ్యయంచేసి, 60 రూ॥ల అక్రమార్జనల ద్వారా ద్రవ్య చలామణి పెంచుతున్నారు. దీనితో రోజురోజుకూ రూపాయి విలువ పడిపోయి, ప్రజల నిజ ఆదాయాలు తరిగిపోతున్నాయి. ఫలితంగా ప్రజల కొనుగోలుశక్తి తరిగిపోతూ మార్కెట్లో సరుకుల అమ్మకాలు మందగిస్తున్నాయి. ఫలితంగా ప్రజావసరాలు తీర్చే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఖాయిలాపడుతున్నాయి.

ఈ మౌలిక సమస్యకు పరిష్కారం చూపలేని పాలకులు బడాబూర్జువాల, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించటమే చేపట్టబూనుకున్నారు. మన్మోహన్ నుండి ఒబామా వరకూ కోరుకుంటున్నది, అమలుచేస్తున్నదీ యిదే. ఈ క్రమంలో వచ్చే అభిప్రాయబేధాలన్నీ టీ కప్పులో తుఫానులే.

దున్నేవానికే భూమి కేంద్ర నినాదంగా భూపునఃపంపిణీ జరగకుండా, దేశంలో సామ్రాజ్యవాద దోపిడీ, ఆధిపత్యాలను ఆపకుండా భారత ఆర్థికవ్యవస్థను మెరుగుపర్చటం అసాధ్యం. కానీ సామ్రాజ్యవాద, బడాబూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రభుత్వం దీనిని అమలుజరపదు. దీనిని అమలు జరిపేందుకు పీడిత వర్గాలు పూనుకోవాలి. ✡

కరపత్రం

# ఆర్.టి.సి. నష్టాలకు కారకులు ఎవరు?

## ఆర్.టి.సి.ని అప్పులపాలుచేసి నిర్వీర్యం గావించే ప్రభుత్వ విధానాలకు, ఉన్నతాధికారుల చర్యలకు వ్యతిరేకంగా పోరాడుదాం!

## ఆర్.టి.సి. పరిరక్షణకు, ఉద్యోగ భద్రతల కొరకు ఐక్యంగా ఉద్యమిద్దాం!

**ఆర్.టి.సి.** పరిస్థితిపై గత కొన్ని నెలలుగా రవాణాశాఖ మంత్రి, ఆర్.టి.సి. ఉన్నతాధికారులు కార్మికులను, ప్రజలను ఆందోళనకు గురిచేసే ప్రకటనలు చేస్తున్నారు "ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. 3500 కోట్ల రూపాయల అప్పులలో వున్నదనీ, (నిజంగా ఇంత అప్పున్నదా?) రాష్ట్రంలోని 210 డిపోలలో 15 డిపోలే లాభాలలో నడుస్తున్నాయనీ, రోజుకి 2 కోట్ల రూపాయలు సంస్థకు నష్టం వస్తున్నదనీ, ప్రతి కార్మికునిపై 3 లక్షల రుణభారం ఉందనీ, ప్రయాణికుల రద్దీ సమయంలో ఛార్జీలను పెంచటంతోపాటుగా విమాన ఛార్జీల తరహాలో డిమాండ్‌ను బట్టి ఛార్జీలను వసూలు చేయాలని" ఆర్.టి.సి.ఎం.డి. ఎ.కె. ఖాన్ ప్రకటించారు. రవాణాశాఖ మంత్రి వివిధ సందర్భాలలో మాట్లాడుతూ "ఆర్.టి.సి.కి ఇప్పటికే ప్రభుత్వం చాలా సహాయం చేసిందనీ, ఎల్లప్పుడూ సహాయం చేయలేమనీ, జీతాలకు కూడా డబ్బుల్లేవనీ, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆర్.టి.సి.ని ముక్కలు చేయక తప్పదనీ, రాష్ట్రంలోని 40 శాతం రూట్లను ప్రయివేటు వారికి అమ్మివేయాలనీ, ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం పెంచాలనీ" ప్రకటనలు చేస్తున్నారు. మరొకవైపున ఆర్.టి.సి.ని నష్టాల నుండి, అప్పుల నుండి కార్మికులే బయట పడవేయాలని, సంస్థను పరిరక్షించుకోవాలనీ, అందుకు కార్మికులు కఠోర శ్రమ చేయాలనీ, త్యాగాలు చేయాలనీ ఆర్.టి.సి. ఉన్నతాధికారులు, పాలకులు ఉపదేశాలు చేస్తున్నారు.

ఆర్.టి.సి.నష్టాలకు కారకులెవరు? కారణాలేమిటి? ప్రభుత్వమూ, పాలకులు, అధికారులు కారా...వాళ్ళ విధానాలూ, చర్యలూ కావా? నిరంతరం శ్రమ చేస్తూ ఆర్.టి.సి. అభివృద్ధిలో ఇంధనమై కరిగిపోతున్న కార్మికులు కాదుగదా....అన్ని రంగాల కార్మికులు, ప్రజలు ప్రజాతంత్ర వాదులు పరిశీలించాలి.

ఆర్.టి.సి. ఉపయోగించే డీజిల్, పెట్రోల్, టైర్లు, ట్యూబులు, ఇంజనులు, చాసిస్‌లు, బాడీ బిల్డింగ్, విడిభాగాలు, ఉపకరణాలు విదేశీ సామ్రాజ్యవాద కంపెనీలద్వారా కొనుగోలు చేస్తున్నారు. వాటి ధరలను కంపెనీలు ప్రతి సంవత్సరము పెంచుతున్నాయి. వీటిపై ప్రభుత్వానికి నియంత్రణ లేదు. అందుచేత ఆర్‌టిసి ఆదాయంలో మెజారిటీ భాగాన్ని విదేశీ కంపెనీలకు దళారీ పాలకులు దోచిపెడుతున్నారు. ఆర్.టి.సి.కి సమాంతరంగా ప్రయివేటు అక్రమ రవాణాను ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నది. దీని మూలంగా ఏటా 1800 కోట్ల రూపాయలు ఆర్.టి.సి.కి వచ్చే ఆదాయంలో గండి పడుతున్నది. ఆర్.టి.సి. వాడే డీజిల్‌పై, రైల్వేలకు 4శాతం మాత్రమే పన్ను వేస్తుండగా ఆర్.టి.సి.కి అంతకన్న ఎక్కువపన్ను వేయటం వలన సంస్థపై 160 కోట్ల రూపాయల అదనపు భారం పడ్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో తిరిగే బస్సు సర్వీసులకు ప్రక్కరాష్ట్రాలు 2 శాతం వాహన పన్ను వేస్తే, మన రాష్ట్రం 7 శాతం పన్నువేసింది. దీని మూలంగా 400 కోట్ల రూపాయలను సంస్థ అదనంగా ఖర్చు చేయాల్సివస్తున్నది. ప్రతి సంవత్సరం ఆర్.టి.సి. సంస్థ నుండి ఎక్సైజ్ సుంకం, అమ్మకపు పన్ను, ఆస్తిపన్ను, స్పేరు పార్టులపై పన్ను మొదలగు పన్నుల ద్వారా రూ. 1000 కోట్లుపైగా ప్రభుత్వం దండుకుంటున్నది. షుమారు 4000 అద్దెబస్సులను సంస్థలో ప్రవేశపెట్టి సంస్థ ఆదాయాన్ని ప్రైవేటు యజమానులకు దోచిపెడుతున్నది.

ఏ.పి.ఎస్.ఆర్.టి.సి.లో ఐషర్ కంపెనీకి చెందిన 100 బస్సులు నడుపుతున్నారు. వీటి నిర్వహణ కొరకు కి.మీ.కు రూ 2.25 చొప్పున సంవత్సరానికి షుమారు 3 కోట్ల రూపాయలు అక్రమ ఒప్పందాలతో ఆర్.టి.సి. ఆ కంపెనీకి చెల్లిస్తున్నది. అత్యంత అధునాతనమైన బస్సులను కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసి వాటిని సక్రమంగా నడపలేకపోవటంతో ఆర్థిక భారం ఆర్.టి.సి.పై పడుతున్నది. అవసరం లేకున్నా సంస్థ నిధులను నిరుపయోగంగా రూ. 5 కోట్లు సెల్ కంపెనీలకు, రూ 100 కోట్లు కమ్యూనికేషన్ సిస్టమ్స్‌కు (పిఐవిఆర్‌ఎస్) కార్పోరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారు. మంత్రులకు, ఎం.ఎల్.ఏ.లకు బహుమతుల పేరుతో కోట్ల రూపాయలు పందేరం చేస్తున్నారు. మరియొక వైపున ఆర్.టి.సి. ఉన్నతాధికారులు, పాలకమండలి సభ్యులు వడ్డీలేని రుణాలు, వివిధ కొనుగోళ్ళలో స్వదేశీ, విదేశీ సంస్థల నుండి కోట్ల రూపాయలు కమీషన్లు పొందుతున్నారు. డి.ఎం. నుండి ఎం.డి. వరకు ఉన్నతాధికారులు అలవెన్సుల రూపంలో, క్యాంప్‌ల పేరుతో (క్యాంప్‌లకు వెళ్ళకుండానే) కోట్ల రూపాయలు దండుకుంటున్నారు.

ఆర్.టి.సి. కార్మికులను ప్రైవేటీకరణకు అంగీకరింప చేయటానికి వారి "మైండ్ సెట్"ను క్రమంలో మార్చటానికీ ప్రతి సం॥ 4 కోట్లు ఖర్చు పెట్టి క్లాసులు నిర్వహిస్తున్నారు. మరోవైపున కోట్ల రూపాయల విలువ చేసే ఖాళీ స్థలాలను 30 సం॥ముల లీజు పేరుతో అధికార పార్టీ ఎం.ఎల్.ఏలు, మంత్రులు బినామీ పేర్లతో స్వంతం చేసుకుంటున్నారు.

పై విధంగా పాడిగేదెలాంటి ఆర్.టి.సి. సంస్థ ఆదాయాలను, ఆస్తులను పాలకులు, ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు దోచుకుంటూ సంస్థను నష్టాలకు, అప్పులకు గురిచేస్తున్నారు.

### కార్మికుల, ప్రజల సంక్షేమం పట్టని ప్రభుత్వాలు– ఉన్నతాధికారులు

ఆర్.టి.సి.లో ఇప్పటికీ అద్దెబస్సులు తిప్పటం, సెట్విన్ బస్సులు, ప్రవేట్ వ్యక్తులకు ఇవ్వటం, బస్టాండులో ఉద్యోగాలను (బుకింగ్, ఎంక్వయిరీ, రిజర్వేషన్, సెక్యూర్టీ) గ్యారేజీలో మెయిన్‌రిపేర్స్, బాడీబిల్డింగ్, ఆయిల్ ఫుల్ చేయటం, క్లీనింగ్, మరుగుదొడ్లు ఔటు సోర్సింగ్ ద్వారా ప్రవేట్ వ్యక్తులకు అప్పజెప్పారు.

ఆర్.టి.సి.లో ప్రజారవాణాను అభివృద్ధి చేసి నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలనిగాని, పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనిగాని పాలకులకు ఏనాడూ అన్పించటంలేదు.

ఈ రోజు ఆర్.టి.సి. 25% ప్రయాణీకులకు మాత్రమే ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నది. మిగతా 75% ప్రయాణికులకు ప్రయాణ సౌకర్యం కల్పించితే 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశం కల్పించవచ్చును. దీనితో పాటు వాహనాల రద్దీని, ఆయిలు వాడకాన్ని, కాలుష్యాన్ని తగ్గించటానికి అవకాశం వున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్యాసెంజరు సర్వీసుకు పనికిరానిబస్సులను సరుకులరవాణాకు ఉపయోగించుట మూలంగా సం॥నకు 1000 కోట్లు ఆదాయం పొందవచ్చు అనే నిపుణుల సలహాను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. బస్సుల అరుగుదల క్రింద, ఖర్చుల క్రింద చూపిన రూ. 213 కోట్ల రూపాయల నిధులతో కొత్తబస్సులు కొనుగోలు చేయుటకు అవకాశం వున్నా, నిధులు లేవనే పేరుతో బస్సులు కొనుగోలు చేయక పోవటం, కార్మిక సంఘాల వత్తిడివలన అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కొనుగోలు చేయటం ఈ విధంగా సంస్థను అప్పుల వూబిలోనికి నెట్టారు. సామాన్య ప్రయాణీకులకు బస్సు సౌకర్యం కల్పించటంలో శ్రద్ధ పెట్టకుండా ఉన్నత వర్గాలకి ఆధునిక బస్సులు, ఏసి బస్సులు ప్రవేశపెట్టి ఆర్.టి.సి. ఆదాయాన్ని వారికి ఖర్చు పెడుతున్నారు.

ఆర్.టి.సి. యాజమాన్యం ప్రయాణికులకు కనీసం మంచినీటి సౌకర్యంకానీ, ఉచిత మరుగుదొడ్ల సౌకర్యంకానీ కల్పించటంలేదు. కాగా, ప్రైవేటు సంస్థలు మరుగుదొడ్లు ఉపయోగించుకున్నందుకు 2/– రూ. నుండి 5/– రూ. వరకు దండుకుంటున్నాయి.

### కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు

సంస్థ అభివృద్ధికి కార్మికులు అహోరాత్రులు శ్రమచేసి,ప్రజలు చెల్లించే ఛార్జీలతో ఆర్‌టిసిని 23,000 బస్సులతో, లక్షల కోట్ల రూపాయల ఆస్తులుతో 1 లక్షా 30వేల మంది కార్మికులు, ఉద్యోగులతో దేశంలోను–ప్రపంచంలోను రవాణారంగంలో అనేక అవార్డులు, ప్రశంసలు పొందింది. అందుకు కార్మికుల శ్రమ, నైపుణ్యత, ప్రతిభే కారణం. ఈలాంటి కార్మికవర్గాన్ని–సంస్థ నష్టాలకు బాధ్యులను చేస్తూ పోరాడి సాధించుకున్న హక్కులను, సౌకర్యాలను పాలకులు హరించి వేస్తున్నారు. సిబ్బందిని తగ్గించి పనిభారం పెంచారు. ఖాళీలను భర్తీచెయ్యటంలేదు–కలెక్షన్ పెరగలేదని కండక్టర్లని, కెఎమ్‌పిల్ పెరగలేదని డ్రైవర్లని వేధిస్తున్నారు. 8 గం॥లు పని అమలుజరగటం లేదు. డబుల్ డ్యూటి పేరుతో 18 గం॥లు పనిచేయిస్తూ చేయని వారిపై కక్ష సాధిస్తున్నారు. డబుల్ డ్యూటికి డబుల్ వేతనాన్ని యివ్వకుండా కొంత మొత్తాన్ని(150 నుండి రూ.250) యిస్తున్నారు. సంస్థకు 60,000 మంది డ్రయివర్లు అవసరంకాగా 35,000 రెగ్యులర్ డ్రయివర్లు, 10,000 మంది కాంట్రాక్టు డ్రయివర్లు మాత్రమే వున్నారు. కండక్టరు డ్యూటీ డ్రయివర్లచేత చేయించటం వలన, డబుల్ డ్యూటీలు చేయించటంవలన యాక్సిడెంట్‌ల సంఖ్య పెరిగింది. దీనికి డ్రయివర్లను బాధ్యులను చేస్తూ పనిష్‌మెంట్సు ఇస్తూ జీతాలనుండి రికవరి చేస్తున్నారు. ఈవిధంగా సిబ్బంది కొరతతో, గ్యారేజీ కార్మికులపైన, డ్రయివర్లు, కండక్టర్లపైన రకరకాల వేధింపు చర్యలకు పాల్పడుతున్నారు.

### మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలు

మహిళా కార్మికులను ఆర్‌టిసి యాజమాన్యం వివక్షతకు గురిచేస్తున్నది. మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటి ఛార్టులు వేయకుండా డబుల్ డ్యూటీలు చేయిస్తూ, మహిళలు ఎదుర్కొంటున్న ప్రత్యేక ఆరోగ్య సమస్యలు పరిగణనలోనికి తీసుకొనకుండా నిర్దాక్షిణ్యంగా నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. దూరప్రాంతాలకు డ్యూటికి వెళ్ళిన సమయంలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు లేక తీవ్ర అనారోగ్యమునకు గురి అవుతున్నారు. మహిళా కార్మికులకు నెలకి 3 రోజులు ప్రత్యేక శలవులు ఇవ్వవలసివుండగా యాజమాన్యం పరిగణనలోకి తీసుకోవటంలేదు.

మహిళా కార్మికులను పురుషకార్మికుల లాగా పనిచేయించుటవలన అనేకమైన మానసిక శారీరక యిబ్బందులను ఎదుర్కుంటున్నారు. మహిళలకు వున్న ప్రత్యేక అవసరాలను అధికారులు పట్టించుకోకుండా డ్యూటీలు చేయించటంవలన మహిళా కార్మికులు అదనపు అవస్థలు పడుతున్నారు.

### ఆర్.టి.సి. కార్మికులారా! ప్రజలారా! ప్రజాతంత్రవాదులారా!

1999 నుండి 2012 వరకు ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా ఆర్.టి.సి.ని, దాని ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే దురుద్దేశ్యంతో ప్రభుత్వాలు చాపక్రింద నీరులాగా అమలు జరుపుటలో నిమగ్నమై వున్నాయి. 2001 సం॥ 2005 సం॥రాలలో ఆర్.టి.సి.ని ప్రవేటుపరం చేయడానికి జరిగిన తీవ్ర ప్రయత్నాలను కార్మికవర్గం ఐక్యంగా తిప్పికొట్టింది. ఈనాటి ప్రభుత్వం ఆర్.టి.సి.కి నష్టాలు వస్తున్నాయనే పేరుతో ప్రవేటు వ్యక్తులకు అప్పగించడానికి కుట్రలు ప్రారంభించింది. మరొక వైపున కార్మికులపైన దాడులను తీవ్రతరం చేసింది. కార్మికులు, కార్మిక సంఘాలు– ఆర్.టి.సి. పరిరక్షణకు, కార్మిక ఉద్యోగ భద్రతకు, హక్కుల పరిరక్షణకు, వేల కోట్లరూపాయల విలువైన ఆస్తుల రక్షణకు ఉద్యమించవలసి వున్నది. తోటి పీడిత ప్రజల, ఉద్యోగసంఘాల సహాయ సహకారంతో, గత ఉద్యమాల వెలుగులో ఐక్యంగా పోరాడవలసియున్నది.

**డిమాండ్స్ :**

- *ఆర్.టి.సి. ఆస్తుల పరిరక్షణకు, ఉద్యోగ భద్రతకు ఉద్యమిద్దాం.*
- *కాంట్రాక్టు విధానం రద్దు చేయాలి, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి.*
- *మహిళా కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నియమ నిబంధనలు రూపొందించాలి.*
- *కండక్టర్ స్థానంలో డ్రైవరే 'టిమ్స్' సహాయంతో టిక్కెట్ ఇచ్చే విధానాన్ని రద్దుచేయాలి.*

**అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ)**



## విప్లవ కార్మికసమాఖ్య వ్యవస్థాపకులు కా॥ కొడవలిరాజేంద్రప్రసాద్‌కు జోహార్లు

**పీడిత,** దళిత ప్రజల పక్షపాతి, విప్లవకార్మిక సమాఖ్య వ్యవస్థాపక నాయకులు, వివిధ కార్మిక యూనియన్ల నేత, నిరంతర శ్రామికుడు కామ్రేడ్ కొడవలి రాజేంద్రప్రసాద్ (67 సం॥లు) 2012 జూన్ 20 రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కామ్రేడ్ రాజేంద్రప్రసాద్‌కు సిపిఐ (ఎం–ఎల్) గుంటూరు జిల్లా కమిటి జోహార్లర్పిస్తున్నది.

1941లో పీడిత దళిత కుటుంబంలో జన్మించిన రాజేంద్రప్రసాద్, వివాహానంతరం గుంటూరులోని బిఐటి పొగాకు కంపెనీలో ఉద్యోగిగా ప్రవేశించి, కమ్యూనిస్టు సిద్ధాంతంపట్ల ఆకర్షితులై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోనూ, ఆ తర్వాత సిపిఎంలోనూ పనిచేసి, దాని నుండివిడివడిన అనంతరకాలంలో విప్లవ కార్మిక సమాఖ్య నేర్పరిచి తన కృషిని సాగించారు. 1975 అత్యవసర పరిస్థితి కాలంలో నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. అనేక కార్మిక యూనియన్ల నేర్పరిచి వారి హక్కులకై పోరాటాలు సాగించారు.

కామ్రేడ్ రాజేంద్రప్రసాద్ కార్మికుల, రైతుకూలీల హక్కుల సాధనకోసం, దళితుల ఆత్మగౌరవం కోసం సాగించే కార్యక్రమాలన్నింటా తమ సంఘ సభ్యులతో కలసి ముందునిలిచారు. ఆయనతో పాటుగా ఆయన కుటుంబంకూడా నిరాడంబర జీవనం సాగిస్తున్నది. ఆయన జీవితంలో అధికభాగం గుంటూరులోని బొంగరాలబీడు నిరుపేద ప్రజాసమూహం మధ్యనే గడిచింది.

వర్గ దోపిడీ, కుల అణచివేతలు లేని నూతన సమాజాన్ని ఆకాంక్షించిన కామ్రేడ్ రాజేంద్ర ప్రసాద్ గుంటూరులో సాగిన వామపక్ష, దళిత ఐక్యకార్యాచరణలన్నింటా తనదైన ముద్రవేశారు. ఐక్యకార్యాచకణలో అనుకున్న విధంగా ప్రజాసమీకరణ, సమయపాలనలను తాను పాటిస్తూ, దానిని 'రాజుగారి గంగాళం'గా మార్చే సంఘాలపై నిష్కర్షతో కూడిన విమర్శ కా॥ రాజేంద్రప్రసాద్ సొంతం.

ముఖ్యంగా కా॥ అంగడి చెన్నయ్యతో గాఢ రాజకీయ అనుబంధమున్న కా॥ రాజేంద్రప్రసాద్ ఆయన హత్యను శషబిషలు లేకుండా ఖండించటంలో ముందు నిలిచారు. కా॥ అంగడి చెన్నయ్య ప్రతి వర్ధంతి రోజున వారి సంఘ ప్రజలతో కలసి బొంగరాలబీడు నుండి చుట్టుగుంటకు నినాదాలు చేస్తూ ప్రదర్శనగా తరలిరావటం మరువలేనిది.

సిపిఐ(ఎం–ఎల్) గుంటూరు జిల్లా కార్యదర్శి, సీనియర్ కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు, పార్టీ నాయకులు కా॥ దేవరశెట్టి వెంకటస్వామి; ఇతరపార్టీల, ప్రజాసంఘాల నాయకులు కామ్రేడ్ రాజేంద్ర ప్రసాద్ అంతిమయాత్రలోనూ, జులై 4న గుంటూరులో జరిగిన సంస్మరణ సభలో పాల్గొని ఆ కామ్రేడ్‌కు ఘన నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

***'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' ఆధ్వర్యంలో జులై 21న ఛలో తిరుపతి, జులై 28న ఛలో విశాఖ, ఆగస్టు 6న ఛలో విజయవాడ పిలుపులను విజయవంతం చేయండి***

–రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

# గుత్తాధిపత్యంతో నిలువుదోపిడీ సాగిస్తున్న సిమెంటు పరిశ్రమాధిపతులు

**కేంద్ర** ప్రభుత్వం 2002 లో చేసిన ఒక చట్టం ద్వారా ఇండియన్ కాంపిటీషన్ కమీషన్ (సిసిఐ)ను ఏర్పాటు చేసింది. బూర్జువా ఆర్థిక సిద్ధాంతం ప్రకారం మార్కెట్టులో స్వేచ్ఛాయుత పోటీ వల్ల వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యతగల సరుకులు లభిస్తాయి. అయితే పరిశ్రమదారులూ, వ్యాపారులూ అంగీకారాలు కుదుర్చుకుని, తమ మధ్య పోటీ లేకుండా చేసుకుని ధరలు పెంచివేయటం సాధ్యమౌతుంది. ఇలాంటివి జరిగినప్పుడు వాటిని నివారించవలసిన బాధ్యత ప్రభుత్వానిది. గతంలో ఎంఆర్‌టిపి (గుత్తాధిపత్య, నిషేధిత వాణిజ్య కార్యకలాపాల చట్టం) ద్వారా వీటిని నియంత్రించే అధికారం ప్రభుత్వానికిఉండేది. ఆ చట్టాన్ని చిత్తశుద్ధితో ఫలప్రదంగా ప్రభుత్వం ఏనాడూ అమలు జరపలేదు.

నూతన ఆర్థిక విధానాలతో పరిస్థితి మారింది. మార్కెట్టులో ప్రభుత్వ జోక్యం కనీస స్థాయిలో వుండాలన్న, మార్కెట్టు శక్తులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలన్న విధానాలను చేపట్టింది. సరళీకరణ పేరిట నిబంధనలను సడలిస్తూ, గత చట్టాలను సవరిస్తూ తన పాత్రను తగ్గించి వేసుకుంటూ వచ్చింది. ఎంఆర్‌టిపి చట్టాన్ని నిర్వీర్యం చేసింది. విదేశీ మారకద్రవ్యాన్ని నియంత్రించే ఫెరా చట్టాన్ని నిర్వహణ (ఫెమా) చట్టంగా మార్చింది. దీనితో గుత్తాధిపత్యంతో ఎడాపెడా ధరలు పెంచుతారన్న విమర్శలు రావటంతో స్వయంపాలిత సంస్థలను ఏర్పాటు చేసింది. టెలికాం రంగానికి ట్రాయ్‌నీ, విద్యుత్తు రంగానికి ఇఆర్‌సిలనూ, సెబి, ఐ ఆర్ డి ఏ వంటి సంస్థలను ఏర్పాటు చేసింది. అలాగే పోటీని నివారించే ఒప్పందాలు కార్యకలాపాలను నియంత్రించేందుకు సిసిఐని ఏర్పాటు చేసింది. కంపెనీల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ సిసిఐ పని చేస్తుంది. తనకందిన ఫిర్యాదులను పరిశీలించి, అవసరమైతే వాటిపై తన యంత్రాంగంతో పరిశోధన చేయించి, ఫిర్యాదు నిజమని ఆధారాలు లభ్యమైతే పెనాల్టిలు విధించే అధికారాలు దీనికున్నాయి. ఉనికిలోకి వచ్చిన పదేళ్లలో మొదటిసారిగా సిసిఐ సిమెంటు కంపెనీలపై కొరడా ఝుళిపించింది. పోటీని నివారించే ఒప్పందాలతో సిమెంటు కంపెనీల పైనా, ఉత్పత్తిని తగ్గించి ధరలు పెంచివేశాయని నిర్ధారించి పది పెద్ద సిమెంటు మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్స్ (సిఎంఏ)పైనా గత రెండేళ్లలో అవి ప్రకటించిన లాభాలలో సగాన్ని పెనాల్టీగా విధించింది. ఈ మొత్తం రూ॥ 6307.32 కోట్లు. 60రోజులలోగా పెనాల్టి చెల్లించమని ఆర్డరు జారీ చేసింది.

అలాగే టైర్లు, పాలియస్టరు, జూటు, పాల పరిశ్రమలపై ఫిర్యాదులు అందాయని, వాటి విచారణ సాగుతున్నదనీ త్వరలో నివేదికలు వెలువరిస్తామనీ తెలిపింది.

**సిమెంటు పరిశ్రమలపై పెనాల్టీలు**

| పరిశ్రమ | పెనాల్టీ (కోట్ల రూ॥) |
|---|---|
| ఏసిసి | 1,147.59 |
| అంబూజా సిమెంటు | 1,163.91 |
| బినాని సిమెంటు | 167.32 |
| సెంచురీ టెక్స్‌టైల్స్ | 274.02 |
| ఇండియా సిమెంట్స్ | 187.48 |
| జె.కె. సిమెంట్ | 128.54 |
| లాఫార్జ్ ఇండియా | 480.01 |
| మద్రాస్ సిమెంట్స్ | 258.63 |
| అల్ట్రాటెక్ | 1175.49 |
| జయప్రకాష్ అసోసియేట్స్ | 1323.60 |
| సి ఎం.ఏ | 0.73 |
| మొత్తం | 6307.32 |

**(బిజినెస్ స్టాండర్డు 22-6-20-2012)**

సిసిఐ ఇచ్చిన తీర్పును పరిశీలించిన తర్వాత అవసరమైన లీగలు చర్యలు తీసుకుంటామనీ, మేమేమీ తప్పు చెయ్యలేదు గనుక మమ్ములను రక్షించుకుంటామని మద్రాస్ సిమెంట్ సిఇఒ అన్నారు.

సిమెంటు కంపెనీలు నిషేదిత వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తున్నాయనీ, కుమ్మక్కు అయి ధరలు పెంచి వేస్తున్నాయనీ బిల్డర్సు అసోసియేషన్ ఆఫ్ ఇండియా 2010లో సిసిఐకి ఫిర్యాదు చేసింది. అవి తమ స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయకుండా తగ్గించివేసి, సరఫరాలు తగ్గించి, కృతిమ కొరత సృష్టించి ధరలు పెంచివేశాయనీ, ఈ పనులన్నీ చేయడానికి సిఎంఏను వేదిక చేసుకున్నాయని ఆధారాలు చూపుతూ ఫిర్యాదు చేసింది.

సిమెంటు కంపెనీల కుమ్మక్కుకు వ్రాత పూర్వక సాక్ష్యాలు ఉండవు గనుక తత్సంబంధిత ఆధారాలను పరిశీలించి నిర్ధారణకు వచ్చాననీ, దీని కోసం సిమెంటు ధరలు, ఉత్పత్తి, కంపెనీల అకౌంటు పుస్తకాలు మొదలైనవన్నీ పరిశీలించామని డైరెక్టరు జనరల్ తెలిపారు. వీటి ఆధారంగా ఆయన సిమెంటు కంపెనీల ఉత్పత్తిని తగ్గించి పోటీ నివారణా చర్యకు పాల్పడ్డాయనీ, అవి కుమ్మక్కు అయి ధరను నిర్ణయించుకున్నాయనీ, ఈ పనులన్నీ సిఎంఏ ద్వారా వ్యవస్థీకృతం చేసాయనీ, దేశాన్ని ఐదు జోన్లుగా విభజించి ఏఏ జోనుల్లో ఏఏ కంపెనీలు ఎంత సిమెంటు అమ్మాలో, దానికి ప్రతి కంపెనీ ఎంత ఉత్పత్తి చేయాలో ఏ ధరకు అమ్మాలో ఒప్పందాలు చేసుకున్నారనీ పరిశీలించినప్పుడు ముడి సరుకుల, ఇతర ఉత్పత్తి ఖర్చు పెరుగుదలను మించి ఎంతో ఎక్కువగా సిమెంటు ధరలు పెరిగాయనీ, 2004-05లో 150 రూ॥ వున్న సిమెంటు బస్తా 2011లో 300 రూ॥లకు పెరిగిందనీ, కాగా సిమెంటు కంపెనీల ఖర్చులు దీనిలో మూడవ వంతు కంటే తక్కువ పెరిగాయనీ తెలిపారు. అలాగే ఈ కంపెనీల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం 2005-06లో 15.7 కోట్ల టన్నులనీ ఇది 2011 నాటికి 28.7 కోట్లటన్నులకు పెరిగిందనీ, ఇదే కాలంలో ఈ ఉత్పత్తి సామర్థ్య వినియోగం 93శాతం నుండి 73 శాతానికి పడిపోయిందనీ తెలిపారు. ఉత్పత్తి ఖర్చుల వంటి ఆంతరంగిక కారణాల వల్ల కాక ఇతర బాహ్యకారణాల వల్లనే ప్రధానంగా ధరలు పెరిగాయని కూడా చెప్పింది. సిమెంటు కంపెనీలకు 26 శాతం లాభాలు రావటం మిగిలిన రంగాలలో 16శాతమే ఉండటం దీనినే తెలుపుతున్నదని చెప్పింది.

సిమెంటు బస్తా ధర 150 రూ. లుండేది. దానిలోనే కంపెనీ లాభం కూడా ఉంది. ఉత్పత్తి ఖర్చులు 30శాతం పెరిగాయి. అంటే బస్తా ధర 195రూ॥ అవుతుంది. ఆ ధరకమ్మితే అంతవరకూ వచ్చిన లాభమే వస్తుంది. కానీ సిమెంటు కంపెనీలు 300రూ॥లకు క్రమంగా పెంచాయి. అంటే 105 రూ॥ అదనంగా పెంచాయి. అసలు లాభానికిది అదనపు సూపర్ లాభం. పోటీ వుంటే సహజంగా కొన్ని కంపెనీలు దీని కంటే తక్కువ ధరకమ్మి లబ్ధి పొందాలని చూస్తాయి. దేశమంతటా అన్ని కంపెనీలు ఒకే ధరకమ్ముతున్నాయంటే పోటీ లేకుండా చేస్తున్నాయన్న మాట. సిసిఐ లెక్కల ప్రకారం, కంపెనీలు తమ అకౌంటు పుస్తకాల్లో చూపిన లెక్కల ప్రకారం (భారతదేశంలోని కార్పోరేటు కంపెనీలు అనుసరించే అకౌంటు విధానాలు తప్పుల తడక అంటూ అమెరికా అకౌంటింగ్ కంపెనీలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి) చూసినా వారి లాభాలు రెండేళ్లలో 12వేల కోట్ల రూ॥లకు పైగానే వున్నాయంటే, గత పదేళ్లలో ఎన్ని వేల కోట్లు పిండుకున్నాయో అర్థంమౌతుంది.

సిసిఐ చేసిన ఈ నిర్ణయం సిమెంటు కంపెనీలు సాగిస్తున్న దోపిడీ తీవ్రతను తెలిపింది. అయితే దీనికి అనేక పరిమితులున్నాయి. సిమెంటు కంపెనీలు దీనిని కోర్టు వివాదంలోకి లాగుతాయి. అది తేలటానికి ఏళ్లూ పూళ్లు గడుస్తుంది. అంత కాలంపాటు సిమెంటు కంపెనీల నిలువు దోపిడీ సాగుతూనే వుంటుంది. మళ్లీ కుమ్మక్కు అయి ధరలు పెంచితే ఎక్కువ పెనాల్టీ వేస్తామని హెచ్చరించింది. అయితే అవి మళ్లీ కుమ్మక్కు కాకుండా నివారించే చర్యలను అది చెప్పలేదు. వేసిన పెనాల్టీ వసూలు చెయ్యలేని సిసిఐ హెచ్చరికను సిమెంటు కంపెనీలు లక్ష్యపెట్టవు. ఇలాంటి నిర్ణయాలు వెలువడినప్పుడు షేరు మార్కెట్లో సిమెంటు కంపెనీల షేర్ల ధరలు పడిపోతాయి. కానీ అలా జరగలేదు. సిమెంటు లాబీ తనకున్న రాజకీయ పట్టుతో నిర్ణయాన్ని తిరగదోడగలదన్న నమ్మకంతో మదుపరులు బెదిరిపోలేదని ఒక పత్రిక సంపాదకీయ వ్యాఖ్య చేసిందంటే, శాసనబద్ధ పాలనా వ్యవస్థల పట్ల విశ్వసనీయత ఎంత కొరవడిన స్థితి ఏర్పడిందో తెలుపుతుంది.

అయితే సిసిఐ మౌనం వహించిన కీలకాంశం ఒకటుంది. దాదాపు 40కి పైగా వున్న సిమెంటు కంపెనీలు ఒక అవగాహనకు ఎలా రాగలిగాయి? విదేశీ కంపెనీలు సిమెంటు రంగంలోకి ప్రవేశించటంతో అవి కొత్తగా సిమెంటు ప్లాంట్లను పెట్టడంతో పాటుగా, పాతవాటిని కొనివేస్తూ గుత్తాధిపత్యాన్ని పొంది ధరలు పెంచి దోపిడీ సాగిస్తున్నాయని వివిధ సందర్భాలలో "జనశక్తి" వ్యాఖ్యానించింది. ఈ గుత్తాధిపతులే సిమెంటు ధరలను నిర్ణయిస్తున్నారు. దీని గురించీ సిసిఐ వ్యాఖ్యానించలేదు.

సిమెంటు ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో రెండవస్థానంలో వుంది. ఫ్రాన్స్‌కు చెందిన లాఫార్జ్, స్విట్జర్లాండుకు చెందిన హాల్‌సిమ్, ఎ.వి.బిర్లా, ఎసిసి, అంబుజా సిమెంటు ఈ ఐదు కంపెనీల చేతిలో 50 శాతం సిమెంటు పరిశ్రమ వుంది. వీటిలోనే ఏసిసి, అంబుజా సిమెంటు కంపెనీలలో హాల్ సిమ్‌ది ఆధిపత్యం. ఏవి బిర్లా కంపెనీలో లాఫార్జ్ పెట్టుబడులున్నాయి. అంటే సగం సిమెంటు పరిశ్రమ రెండు విదేశీ కంపెనీల ఆధీనంలో వుంది. గుజరాత్‌లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ కోటి టన్నుల సిమెంటు ఉత్పత్తి చేయగలిగే మూడు ప్లాంటులు గల జయప్రకాష్ అసోసియేట్స్ నుండి వాటిని కొని వేయటానికి ఆ రెండు విదేశీ కంపెనీలు చర్చలు సాగిస్తున్నాయి. సిమెంటు ఉత్పత్తికి అవసరమైన సున్నపురాయి గనులు, ఇతర ముడిసరుకులను కైవశం చేసుకునే పనిలో వున్నాయి. సిమెంటు అమ్మకాలేకాక, రెడీమిక్స్ తదితర సిమెంటు ఉత్పత్తి అమ్మకాలలోకి విస్తరిస్తున్నాయి. రెడీమిక్స్ రంగంలో 40 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్నీ ఈ ఏడాది రెట్టింపు చేసే పనిలో లాఫార్జ్ వుంది. ఈ రకంగా సిమెంటు రంగంపై గుత్తాధిపత్యం గల విదేశీ కంపెనీలు నిలువు దోపిడీ చేసుకుంటున్నాయి.

సిమెంటు ఉత్పత్తికి ముందు వెనుకల గల అన్ని రంగాలతోను కలిపి ఏర్పడుతున్న గుత్తాధిపత్యం వల్ల విదేశీ కంపెనీలకు లాభాలధికంగా వస్తున్నాయి. వీటి ధాటికి తట్టుకోలేక చిన్న సిమెంటు కంపెనీలు అమ్ముడై పోతున్నాయి. వీటి గుత్తాధిపత్యం మరింత పెరిగింది. ఇలా గుత్తాధిపత్యం ఏర్పడటాన్ని బూర్జువా ఆర్థిక పరిభాషలో సంఘటితమవటం (కాన్సాలిడేషన్) అంటున్నారు. దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి జరుగుతుంది (ఇకానమీస్ ఆఫ్ స్కిలు) గనుక ఆహ్వానించదగ్గ పరిణామ మంటున్నారు. కానీ వాస్తవంలో దీనికి భిన్నంగా జరిగింది. పెరగాల్సిన ఉత్పత్తి తగ్గింది; తగ్గాల్సిన ధరలు పెరిగాయి. గుత్తాధిపత్యపు అసలు స్వభావం యిదే.

గుత్తాధిపత్యం వున్న విదేశీ కంపెనీలు ఉత్పత్తి తగ్గించి ధరలు పెంచినందువల్ల లాభాలు దండు కుంటున్నాయి. కాగా ఉత్పత్తి తగ్గించిన గుత్తాధిపత్యం లేని కంపెనీలకు బస్తా సిమెంటు ఉత్పత్తికి ఖర్చు ఎక్కువుండి తక్కువ లాభాలొస్తున్నాయి. లాభాలెక్కువున్న కంపెనీలు రుణాలు తక్కువ చేస్తాయి. చిన్న కంపెనీలకు బ్యాంకు రుణాలు ఎక్కువుంటాయి. వాటికి వడ్డీ చెల్లింపులతో లాభశాతం తగ్గుతుంది. ఈ పరిశ్రమను పరిశీలించి వాటికి రేటింగులిచ్చే ఫిట్చ్ రేటింగ్ అన్న సంస్థ "భారత సిమెంటు రంగంలో వ్యవస్థాగతంగా ఉన్న ఈ అసమానతను సరిచేయడానికి సిసిఐ నిర్ణయం పరోక్షంగా తోడ్పడుతుంది" అని జోస్యం చెప్పింది. అంటే విదేశీ కంపెనీల గుత్తాధిపత్యం మరింత పెరుగుతుందని చెప్పింది.

గుత్తాధిపత్యానికి కళ్లాలు వేసేవని చెబుతూ ఏర్పాటు చేసిన సంస్థలు కూడా పరోక్షంగా గుత్తాధిపత్యానికి తోడ్పడేవిగానే వుంటున్నాయన్నది స్పష్టమే. విద్యుత్తు రంగంలో ఇఆర్‌సిలు ప్రజలపై ఛార్జీల భారాలు మోపేందుకు శిఖండులుగా వ్యవహరిస్తున్న తీరు ప్రజల అనుభవం లోనిదే కదా! ఈ సిసిఐ కూడా మూల కారణాన్ని దాచిపెట్టి దానినే బలీయం చేసేందుకు సహాయపడటంలో ఆశ్చర్యపడాల్సిందేముంది! ✡

# బందరు ప్రాంత అమరుల వర్ధంతి సభ



అమరుల వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న కా॥ కె. కోటయ్య

**బందరు, 26-6-12 :**

**బందరు** ప్రాంత అమరజీవులు కామ్రేడ్స్ వేమన ఆదినారాయణ, పినపాల బాబు, కొక్కిలగడ్డ రఘురామయ్య (తాత), జన్ను సూరయ్యల వర్ధంతిని పురస్కరించుకొని చిన్నాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద "సాగునీరు, విత్తనాలు, ఎరువులు, రైతాంగ సమస్యలపై" సదస్సును రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) మచిలీపట్నం ఏరియాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సదస్సుకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకులు కా॥ గుమ్మడి కృష్ణ, కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. అమరుల చిత్రపటాలకు పూలమాలలతో, పుష్పాలతో పలువురు నాయకులు, కార్యకర్తలు, బంధువులు నివాళులర్పించారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కోటయ్య సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తూ వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే రైతాంగాన్ని అనేక సమస్యలు వేధిస్తున్నాయనీ; జూన్ 15కల్లా సాగునీరు అందించే సాంప్రదాయన్ని పాలకులు ఏనాడో వదిలేశారనీ, ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు పడితే, వరదలొస్తే సాగునీరు ఇస్తాం, లేకపోతే లేదని ప్రభుత్వం చేతులెత్తేసిందనీ, సాగునీరు, వ్యవసాయానికి ప్రాధాన్యత నివ్వకుండా విద్యుత్తు కంపెనీల అవసరాలకు, విద్యుత్తు ఉత్పత్తికి వినియోగించుకోడం దుర్మార్గమనీ, సాగునీటి ప్రైవేటీకరణ బిల్లు తెచ్చి కాల్వలకు సాగునీటి మీటర్లు పెట్టి సాగునీటి ఛార్జీలు వసూలు చేసే ప్రయత్నాలను తీవ్రంగా విమర్శించారు. రైతులను విత్తన కంపెనీల దయాదాక్షిణ్యాలకు వదిలి పెట్టారనీ, బి.టి. పత్తి విత్తనాలను 2000-2500 రూ.లకు బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారనీ, ప్రతి సం॥ ఎరువుల సమస్యను రైతులెదుర్కొంటూనే ఉన్నారనీ, 12 సార్లు ఎరువుల ధరలు దారుణంగా పెంచేశారనీ, అత్యవసర నిల్వల కోసం కేంద్రం పంపిన 2500 టన్నుల ఎరువులను రాష్ట్రానికి పంపితే గోడౌన్లు ఖాళీ లేవనే పేరుతో దిగుమతి చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం వదిలేసిందని, ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేస్తూ రైతాంగాన్ని బలిచేస్తున్న ఈ పరిస్థితుల్లో రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అమరుల స్ఫూర్తితో రైతులు సంఘటిత ఆందోళన చేయడం మినహా మరో దగ్గర మార్గంలేదని కా॥ కోటయ్య పిలుపునిచ్చారు.

ఆ తర్వాత ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ వరి, పత్తి, వేరుశనగ వంటి విత్తనాలు 14 లక్షల టన్నులు అవసరం అవుతుందని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పెడితే 5 లక్షల టన్నులు మాత్రమే సేకరించి కేవలం 17 వేల టన్నులు మాత్రమే పంపకం చేసారనీ, సకాలంలో సాగునీరు, విత్తనాలు, ఎరువులు రైతులకు అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వెనుక విదేశీ కంపెనీల ప్రయోజనాలను కాపాడడమనే కుట్ర దాగివుందని అన్నారు.

ఇంకా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యవర్గ సభ్యులు కా॥ పామర్తి అంజమ్మ, కా॥ కొప్పినేని ఉమామహేశ్వరరావు, ఏఐఎఫ్‌టియు(న్యూ) బందరు ఏరియా నాయకులు కా॥ ముచ్చు సుధాకరరావు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల గురించి, ప్రభుత్వ నిర్లక్ష్యం గురించి సోదాహరణంగా వివరించారు. అమరులకు ఘన నివాళులర్పించారు. సదస్సుకు రైతులు, కూలీలు 150 మంది హాజరయ్యారు.

సదస్సుకు ముందుగా చిన్నాపురం పాలకూరు రామాలయం దగ్గర నుండి అంబేద్కర్ విగ్రహం సెంటర్ వరకు ప్రధాన వీధిలో రైతులు, కూలీలు ప్రదర్శనను నిర్వహించారు. అమరులకు జోహార్లర్పిస్తూ, వ్యవసాయ రంగంలో పాలకులు అనుసరిస్తున్న దళారీ విధానాలను ఎండగడ్తూ నినాదాలు చేశారు. సదస్సులో ప్రజాకళాకారులు పాడిన జనం పాటలు ఆకట్టుకున్నాయి. బాలసంఘం కళాకారులు ప్రదర్శించిన "కిసాన్ డాన్సు" నృత్యరూపకం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ✡

## నీతి బాహ్యా... (4వ పేజీ నుండి)

మనదేశ ప్రజలను ప్రయోగశాలల పశువులుగా ఉపయోగిస్తున్న నీతిబాహ్యా ఔషధ ప్రయోగాల సందర్భంలోనూ, సామ్రాజ్యవాదులకు దాసోహమన్న పాలకుల విధానాల గురించిగానీ, దేశంపట్ల, ప్రజలపట్ల అణుమాత్రమైనా బాధ్యతలేని, తమ సూపర్ లాభసముపార్జనే ఏకైక లక్ష్యంగాగల దళారీ పాలకుల విధానాల జోలికి గానీ పోకుండా స్థాయీ సంఘం జాగ్రత్తవహించింది. నియంత్రణా సంస్థలకు సంబంధించిన వైఫల్యంగా మాత్రమే పేర్కొనటానికి పరిమితమైంది. అన్ని వైపుల నుండి తీవ్ర విమర్శలకు గురైన నీతిబాహ్యా ఔషధప్రయోగాలను తామూ తప్పు పడుతున్నట్లుగా పేర్కొంటూనే రానున్నకాలంలో వానిని మరింత సరళతరం, తీవ్రతరం చేయబోతున్నారనేది సుస్పష్టం. ప్రజలను వివిధ రూపాల్లో మోసగించే, ప్రక్కదోవ పట్టించే, అంతిమంగా పెనంమీద నుండి పొయ్యిలోకి పడదోసే దోపిడీ పాలకుల కుటిల విధానాల పట్ల ప్రజలు అప్రమత్తంగావుంటూ వాటిపై తమ పోరాటమొనను ఎక్కుపెట్టాలి. ✡

# తలదాచుకునేందుకు జానెడు నివాసస్థలానికై కొనసాగుతున్న దళిత, పీడిత ప్రజల ఆందోళన


రెంటచింతలలో ధర్నా

**రెంటచింతల:**

**గుంటూరు** జిల్లా-మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలో నిరుపేదలు తలదాచుకోను జానెడు జాగా లేక తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారు, గత పది సం॥లుగా పలుమార్లు ప్రభుత్వాధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది.

రెంటచింతల గ్రామ రెవిన్యూ భూమిలో 300 సర్వే నెంబరులోని అసైన్డ్‌భూమిని గ్రామ పెత్తందారీ వర్గాలు తమ ఆధీనంలో వుంచుకున్నారని ప్రభుత్వాధికారులకు తెలిసినా మిన్నకుండిపోయారు.

ఈ నేపథ్యంలో, చట్టవిరుద్ధంగా అసైన్డు భూములనాక్రమంచిన పెత్తందార్లను తొలగించి, నిరుపేద దళిత బలహీనవర్గాలకు నివాస స్థలాలను కేటాయించ వలసిందిగా డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో 25-6-12న మండల తహశిలుదారుకు విజ్ఞప్తి చేశారు.

**అసైన్డ్ భూమిలో గుడిశలు ఏర్పరచుకున్న ప్రజలు**

భూస్వామ్య పెత్తందార్లకు కొమ్ముగాసే రాజ్యాంగ యంత్రం నిరుపేదలకు నివాసస్థలాన్ని కేటాయించటానికి ముందుకు రాలేదు. దీనితో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో నిరుపేద, దళిత, గిరిజన, బలహీనవర్గాల, మైనారిటీ ప్రజానీకం పెద్దఎత్తున తరలివెళ్ళి పెత్తందార్ల ఆధీనంలోని 300 సర్వేనెంబరు అసైన్డ్ భూమిలో గుడిశలు వేసుకున్నారు.

పుల్లారెడ్డికుంట సర్వేనెంబరు 300లో గుడిశలు వేసుకున్న నిరుపేదలందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో మండల కేంద్రమైన రెంటచింతలలో 9-7-12న ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముందుగా స్థానిక సంఘం కార్యాలయం నుండి ఆంజనేయ మాన్యం, ఆరోగ్యపురం, అంబేద్కర్ విగ్రహం మీదుగా తహసిల్‌దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు.

ధర్నాలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్స్ లక్ష్మారెడ్డి, నాగేశ్వరరావు; జిల్లా నాయకులు కామ్రేడ్స్ కోటేశ్వరరావు, రాంబాబు; ఏఐఎఫ్‌టియు రాష్ట్రనాయకులు కా॥డివిఎన్ స్వామి, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥నిర్మల; సీనియర్ కమ్యూనిస్టు అమరలింగం; పాలకుర్తి సత్తెయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. వందల, వేల, లక్షఎకరాలను బడాపెట్టుబడి దారులకు, కార్పొరేటు సంస్థలకు అప్పనంగా కట్టబెడ్తున్న ప్రభుత్వం, నిరుపేదలకు సెంటుభూమిని నివాసస్థలాలకు ఇవ్వక పోవటాన్ని తీవ్రంగా ఎండగట్టారు. ఎసైన్డ్‌భూమిలో గుడిశలు నిర్మాణం చేసుకున్న ప్రజలకు ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు వెనువెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

**గుడిశెలను పీకిన పెత్తందార్లు-కొనసాగుతున్న ఆందోళన**

అసైన్డ్ భూములను ఇప్పటివరకూ తమ చేతులలో వుంచుకున్న గ్రామ పెత్తందార్లు, ఆ స్థలంలో పేదలు గుడిశలు వేసుకోవటాన్ని సహించలేక రౌడీగూండాలతో దొంగచాటుగా వెళ్ళి గుడిశెలను పీకివేయించారు.

పెత్తందార్లు, తమకు ఏ విధమైన హక్కూలేని ఆసైన్డ్ భూములలో పేదలువేసుకున్న గుడిశలను పీకి వేయటాన్ని తీవ్రంగా నిరసిస్తూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిరుపేద గుడిశవాసులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పేద గుడిశవాసుల న్యాయమైన ఆందోళనకు ప్రజలంతా అండగా నిలవాలని విజ్ఞప్తిచేస్తూ రైతుకూలీసంఘం స్థానిక తహశిల్‌దారు కార్యాలయంవద్ద కార్యక్రమం నిర్వహించింది. గుడిశలు దక్కించుకునేందుకు సంఘర్షణ కొనసాగుతోంది. ✡

# ఆదివాసులకు విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ అవసరాలను ప్రభుత్వం సత్వరమే అందించాలని ఆందోళన


మక్కువలో ప్రదర్శన

**మక్కువ, 6-7-12:**

విజయనగరంజిల్లా మక్కువ మండల పరిధిలోని గిరిజన రైతులకు వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ అవసరాలను సమకూర్చటంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో మక్కువ తహసిల్‌దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ ధర్నాలో మాట్లాడుతూ గిరిజన రైతులకు అందించవల్సిన సబ్సిడీని ప్రభుత్వం రద్దుచేస్తున్నదని, ప్రతి సంవత్సరం సబ్సిడీపైన విత్తనాలు ఇచ్చే ఐటిడిఏ ఈ సంవత్సరం నిధులు రాలేదని ప్రకటించిందని, రోజురోజుకు ఎరువులు, పురుగుమందుల ధరలు చుక్కలనంటుతున్నాయనీ, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను బయట మార్కెటులో కొని సాగుచేస్తూ గిరిజన రైతులు అప్పులపాలవుతున్నారనీ, గిరిజనుల అభివృద్ధి కోసమే ఏర్పడినాయంటున్న ప్రభుత్వ సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, గిరిజన సహకార సంస్థ వ్యవసాయ రుణాల మంజూరుకు చేతులెత్తేసిందని పేర్కొంటూ ఈ డిమాండ్ల పరిష్కారంకోసం ఆందోళన సాగించాలన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ ఊయక ముత్యాలు మాట్లాడుతూ గిరిజనప్రాంతంలో వున్న జలవనరులను ఉపయోగించుకోగలిగితే సాగునీటి సమస్యను పరిష్కరించుకోవచ్చుననీ, చిత్తశుద్ధి, ప్లానింగ్, పర్యవేక్షణ లేకపోవటంతో గిరిజన ప్రాంతంలో సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారనీ, సురాపాడువద్ద మిని రిజర్వాయర్ నిర్మించడం వలన మక్కువ, సాలూరు, పార్వతీపురం మండలాల పరిధిలో సుమారు 6వేల ఎకరాలకు కొరత లేకుండా సాగునీరు అందించ వచ్చుననీ, కానీ 7 కోట్లు ఖర్చుపెట్టి అడారువద్ద చెక్‌డ్యాం నిర్మించారు తప్ప ఒక చుక్కనీరు కూడా సాగుకు అందలేదనీ, 2 కోట్ల రూ॥లు ఖర్చుతో సురాపాడు దగ్గర కడుతున్న చెక్‌డ్యాంకూడా నేడు అటవీశాఖ అభ్యంతరంతో ఆగిపోయిందనీ, కోట్ల రూ॥లు కాంట్రాక్టర్లు, అధికార్లు దిగమింగడానికి ఉపయోగపడింది తప్ప, సాగునీటి వనరుల సమస్య పరిష్కారంకాలేదని అన్నారు.

సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కా॥బి.నర్సింగరావు మాట్లాడుతూ ఈ నియోజకవర్గం నుండి గెలిచిన సాలూరు ఎంఎల్ఏ రాజన్నదొరగారు శాసనసభా ఎస్‌టి కమిటి ఛైర్మన్‌గా ఎన్నికయినందున గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతారని ఆశించిన గిరిజనులకు ప్రతి సంవత్సరం అందించే సబ్సిడీలు కూడా లేకపోవడం, సాగునీటి వనరుల సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరాశకు గురయ్యారని, పై డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఇంకా ఈ ధర్నాలో సంఘం జిల్లా నాయకులు కా॥తవిటినాయుడుతోపాటు వివిధ గిరిజన గ్రామాల ప్రజానీకం పాల్గొన్నారు. ధర్నా కార్యక్రమానికి ముందుగా మక్కువ మండల కేంద్రంలో 500మంది ఆదివాసులు పెద్దఎత్తున ప్రదర్శన చేపట్టి తమ డిమాండ్లను ఎలుగెత్తి చాటారు. ప్రదర్శనకు ముందుభాగాన ప్రజాకళాకారులు డప్పు నృత్యాలు, గిరిజన సాంప్రదాయక 'కింద్రీ' నృత్యాన్ని ప్రదర్శించారు. ధర్నా అనంతరం తహశీల్దారుకు డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని అందజేశారు. ✡

## లక్షింపేట...

(చివరి పేజీ నుండి)

కా॥ డి. వర్మ, జిల్లానాయకులు భాస్కరరావు, నరసింగరావు; ఏఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కా॥ బెహరా శంకర్రావు, రెడ్డినారాయణరావు; దళిత బహుజనఫ్రంట్, ఎమ్ఆర్‌పిఎస్, బిఎస్‌పి, సామాజిక న్యాయ ఉద్యమవేదిక, బహుజనగళం, దళిత ఐక్యవేదిక, యస్‌సిఎస్‌టి సేవాదళ్, ఆటో యూనియన్‌ల నాయకులు లక్షింపేట దళితులకు సంఘీభావంగా ఈ ధర్నాలో పాల్గొన్నారు.

**విశాఖపట్నం :**

'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' ఆధ్వర్యంలో విశాఖ జిల్లా కలక్టర్ కార్యాలయం వద్ద జులై నాలుగున ధర్నా నిర్వహించి లక్షింపేట దళితుల డిమాండ్లను ఎలుగెత్తి చాటారు. ఈ కార్యక్రమంలో భూమి హీన దళిత కూలీసంఘం, వీరవల్లి అగ్రహారం నాయకులు గెడ్డం దశరథరావు, ఈశ్వరరావు; ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు కా॥ గణేష్ పండా, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు కా॥ పి. శ్రీను నాయుడు, నవయువ సమాఖ్య, ఓపిడిఆర్ తదితర ప్రజాసంఘాలు పాల్గొని లక్షింపేట దళితులకు సంఘీభావాన్ని ప్రకటించాయి.

**కాకినాడ :**

లక్షింపేట దళితులపై దాడులను ఖండిస్తూ, దళితులకు 250 ఎకరాల భూమిని సత్వరం కేటాయించాలని డిమాండ్ చేస్తూ సంఘీభావ కమిటి ఆధ్వర్యాన తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.), కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, దళిత బహుజన వ్యవసాయ వృత్తి దారుల యూనియన్ తదితర 15 దళిత, ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. ధర్నానుద్దేశించి అయినాపురపు సూర్యనారాయణ, సుబ్బారావు; రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కా॥ గుబ్బల అమ్మాజీ, వనచర్ల సుబ్బారావు తదితరులు మాట్లాడారు. అనంతరం ప్రతినిధులు కలెక్టర్‌ను కలసి మెమోరాండం అందజేశారు.

**ఏలూరు :**

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద 'లక్షింపేట దళితపోరాట సంఘీభావ కమిటి' ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. 22 సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో 250 మందికి పైగా పాల్గొని దళితుల హక్కుల అణచివేతను ఎలుగెత్తి ఖండించారు. ధర్నానుద్దేశించి కుల నిర్మూలనా పోరాట సమితి అధ్యక్షులు జాన్‌రాజు; ఎపిసిఎల్‌సి రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీమన్నారాయణ; రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ ఎం.ఎస్, నాగరాజు తదితరులు మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన నిలిచేవారంతా ఐక్యంగా భూమి సమస్యపై పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టరును కలిసి మెమోరాండం అందజేశారు.

**మచిలీపట్నం :**

'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' రాష్ట్రవ్యాపిత పిలుపు మేరకు కృష్ణాజిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. జగన్; ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ వై. సోనీ లక్షింపేట దళితుల భూమి సమస్యను పరిష్కరించకుండా ఉద్దేశపూరిత నిర్లక్ష్యం వహించటమే దళితులపై హత్యాకాండకు భూమికను ఏర్పరిచిందన్నారు.

ఈ ధర్నాలో ఇంకా దళిత స్త్రీ శక్తి (సువార్తమ్మ), కుల నిర్మూలనా పోరాట సమితి (కె. కృష్ణ), ఓపిడిఆర్ (ఎం. రామకృష్ణ), మానవహక్కుల వేదిక (పి. అమర్), స్త్రీవిముక్తి సంఘటన (టి. నాగలక్ష్మి), నవయువ సమాఖ్య (జి. మల్లేష్), ఏపిసిఎల్‌సి (రాఘవయ్య), ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (పేరిశెట్టి విఘ్నేశ్వరరావు) తదితర సంఘాల నాయకులు లక్షింపేట దళితుల భూమి సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరుకు మెమోరాండం అందించారు.

ధర్నాకు ముందుగా సంఘీభావ కమిటి ఆధ్వర్యంలో లక్ష్మీటాకీసు సెంటరులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, అక్కడినుండి ప్రదర్శనగా కలెక్టరు కార్యలయానికి వెళ్ళారు.

**గుంటూరు :**

లక్షింపేట దళితులను హతమార్చిన దోషుల విచారణకు ప్రత్యేక కోర్టును లక్షింపేటలో తక్షణం ఏర్పాటు చేయాలని సంఘీభావ కమిటి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లక్షింపేట దళితుల హత్యాకాండను నిరసిస్తూ రైతుకూలీసంఘం వెలువరించిన బులిటెన్‌ను, కరపత్రాలను ఈ సందర్భంగా విస్తృతంగా ప్రజలమధ్యకు తీసుకెళ్ళారు.

ఈ కార్యక్రమంలో రెతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ సింహాద్రి లక్ష్మిరెడ్డి; కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పొందుగల మస్తాన్‌రావు, ఎపిసిఎల్‌సి (ప్రభాకర్), పిడిఎమ్ (వై. వెంకటేశ్వరరావు), ప్రజాకళామండలి (ఉన్నం రాణి), వైకె, ఇంకా, చైతన్య మహిళా సంఘం, విరసం, ఆర్‌పిఐ ప్రతినిధులు ధర్నా అనంతరం కలెక్టరును కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

**ఒంగోలు :**

లక్షింపేట దళితుల నరమేధాన్ని ఎలుగెత్తి ఖండిస్తూ, దోషులకు కఠిన శిక్షలు విధించాలని, లక్షింపేటలో ప్రత్యేక కోర్టు ఏర్పరచి సత్వరం విచారణ పూర్తిగావించాలని, మృతులకుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారం అందించటంతోపాటుగా తక్షణం మద్దువలస రిజర్వాయర్ మునక భూములలో మిగిలిన 250 ఎకరాల ప్రభుత్వ భూములను లక్షింపేట దళితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో జులై నాలుగున ధర్నా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి దళిత కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు నీలం నాగేంద్రం అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి ఎస్. లలితకుమారి (రైతుకూలీసంఘం). ఎం.వి. కృష్ణయ్య, సుధాకర్ (ఓపిడిఆర్), ఎం.ఎస్. శాయి ఏఐఎఫ్‌టియు (న్యూ), పల్నాటి శ్రీరాములు (బహుజనకెరటాలు), నూకతోటి బాబూరావు, చెంచయ్య (దళిత మహాసభ), నూకతోటి రవికుమార్, కత్తి కళ్యాణం (రచయితలు), జి.వి.శేషు (కొండెపి ఎంఎల్ఏ), కనకయ్య, అన్నపూర్ణ (ఏపిసిఎల్‌సి), పొటికలపూడి జయరాం, కె. వెంకయ్య, బత్తుల పున్నయ్య తదితరులు ప్రసంగిస్తూ భూమికోసం, ఆత్మగౌరవంకోసం లక్షింపేట దళితులు సాగించే పోరాటానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

**నెల్లూరు**

జులై నాలుగున నెల్లూరు జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట 'సంఘీభావ కమిటి' పిలుపు మేరకు జరిగిన ధర్నాలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు పాల్గొని ప్రసంగిస్తూ లక్షింపేట నరమేధానికి వెల్లువెత్తిన నిరసనల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తూ, కంటి తుడుపు చర్యలు చేపట్టింది మినహా, అసలైన భూమి సమస్య పరిష్కారానికి పూనుకోలేదని గ్రహించి దానికోసం పోరాటం సలపటమే లక్షింపేట దళితులకు వాస్తవ అర్ధంలో సంఘీభావంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి, కా॥ జి. సునీత, కోశాధికారి ఆర్. సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :**

'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నాకు ముందుగా ప్రదర్శన నిర్వహించారు. ధర్నా సందర్భంగా జిల్లా రైతుకూలీసంఘం నాయకులు కా॥ గంగుల నర్సయ్య, జిల్లా దళితసంఘ నాయకులు పరమేశ్వరరావు, రాంచందర్, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దయానంద్, విజయకుమార్, తెలంగాణా ప్రజాఫ్రంట్ నాయకులు రాఘవులు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**కరీంనగర్**

'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జులై నాలుగవ తేదీన ధర్నా నిర్వహించారు. భూమి సమస్య-ఆత్మగౌరవ సమస్య విడదీయరానివని ఈ సందర్భంగా పలువురు వక్తలు ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. లక్షింపేట నరమేధం-రాజ్య యంత్రాంగం, అధికారరాజకీయం, కులదురహంకార పెత్తందార్లు పథకం ప్రకారం సాగించిన ఉద్దేశ్యపూర్వక హంతకదాడిగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ (బామండ్ల రవీందర్, సరోజ), ఇంకా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణా అంబేద్కర్ యువజన సంఘం, మాలమహానాడు, బిటిఎఫ్, సిపిఐ(ఎం-ఎల్) ఎన్‌డి తదితర పార్టీలు, ప్రజాసంఘాలు పాల్గొని లక్షింపేట దళితులకు సంఘీభావంగా నిలిచాయి.

**నల్గొండ**

లక్షింపేట దళితుల నరమేధాన్ని ఖండిస్తూ సంఘీభావ కమిటి పిలుపు మేరకు జులై నాలుగున జిల్లా కేంద్రమైన నల్గొండలో కలెక్టరు కార్యాలయం ఎదుట వివిధ దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాణాల వెంకటరెడ్డి, బండారు వేలాద్రి (రైతుకూలీసంఘం), కొత్తగొట్టు మల్లన్న (సామాజిక తెలంగాణా), గురవయ్య (మానవహక్కుల సంఘం), శివయ్య (టిడిఎఫ్) ఇంకా తెలంగాణా ప్రజాఫ్రంట్, చైతన్య మహిళా సంఘం, కుల నిర్మూలనా పోరాట సమితి తదితర సంఘాలనుండి ప్రతినిధులు పాల్గొని లక్షింపేట దళితులకు భూమిపై వెంటనే హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ✡

1985లో కారంచేడు దాడి తర్వాత- కమ్యూనిస్టు పార్టీలు, నగ్జలైట్లు తమను మోసంచేశాయన్న దళిత మహాసభ వంటివారు ఈనాడు ఎక్కడ వున్నారు? లక్షింపేట సంఘటనను ఆత్మగౌరవ సమస్యగా మాత్రమే చూస్తున్నారు. 1100 కోట్ల రూ॥ ప్యాకేజీకి వత్తాసు పలుకుతున్నారు.

మమ్మల్ని గుడిలోకి ఎందుకు రానివ్వరని దళితులు ప్రశ్నిస్తే, దేవుడినే మీ వాడకు తీసుకొస్తామన్న 'దళిత గోవిందాన్ని' చూశాం. లక్షింపేట దళితులు మాకు భూమి ఇక్కడే కావాలి అంటూంటే, మీకు ప్రత్యేకంగా ఒక పట్టణం నిర్మిస్తామంటున్నారు. లక్షింపేటలో కాపుల నివాసాల ప్రక్కనే మాలలు వున్నారు. వెలివాడల్లో ఉండేవాడు మా సరసన సేద్యం చేస్తాడా? అని సహించ లేకే లక్షింపేట దాడి జరిగింది. దళిత ఉద్యమాల్ని పాలక పక్షాలవద్ద తాకట్టుపెట్టాలని చూస్తున్నారు కొందరు.

లక్షింపేట ప్రాంత సిఐ, ఎస్ఐ, ఏఎస్పి, మంత్రి కోండ్రు మురళి-అందరూ మాలకులానికి చెందినవారే. కూటికిలేని కమ్మోడు, రెడ్డోడు తమ వాడు మంత్రి అయితే గుండెలు చరుచుకుంటాడు. లక్షింపేట దళితులు సిఐ, ఏఎస్పి, కోండ్రు మురళిలను మావోళ్ళు అనుకున్నారు. ఎవరూ వీరిని కాపాడలేదు. తమపై జరిగిన దాడులను వీరెవరూ అరికట్టకపోగా కనీసం కేసులను కూడా నమోదు చేయలేదు. గతంలో ఒక చిన్నకేసుపై మూడు రోజులు మాత్రమే జైల్లో ఉండివచ్చిన అనంతరం కాపులు, దళితుల అంతుచూస్తామని ఇల్లిల్లూతిరిగి హెచ్చరించినపుడు కోండ్రు మురళి ఏమయ్యాడు?

దళితులుగా వుండి అధికారంపొందిన దళారీలుగా వున్నారు. ఈ వర్గీకరణ, విభజనరేఖ గీయకుండా దళిత సమస్యకు పరిష్కారంలేదు. 15 శాతంగావున్న దళితులు భూమి, భుక్తి, ఆత్మగౌరవం కావాలంటున్నారు. వాటిని గురించి ఆలోచించమని ఎమ్ఎల్ పార్టీలన్నింటినీ అడుగుతున్నాను. ఈ దేశంలో భూస్వాముల, సామ్రాజ్యవాదుల ప్రతినిధులైన పాలకులతో జతకట్టిన ఆధునిక మనువాదులను ఎదుర్కోవటానికి దళితులు సిద్ధంగా వున్నారు. దీనికి లక్షింపేట ఉదాహరణ. అయితే ఉద్యమ నాయకులు సిద్ధంగా వున్నారా అని విప్లవ పార్టీల ముందుంచుతున్నాను.

ఈ దేశంలో లక్షింపేటలు అనేకం జరగబోతున్నాయి. భూమికి - ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య, పీడిత ప్రజల పక్షాన ఆలోచించే వాళ్ళకి ఇది ఒక ఛాలెంజ్.

లక్షింపేటలో దళితుల భూములు లాక్కొన్నారు. వాటికి డబ్బు పరిహారం ఇవ్వలేదు. కారణం ప్రభుత్వ భూములవటం అని అన్నారు. అయితే కాపులకు పరిహారం లక్షల్లో చెల్లించారు-ఉద్యోగాలిచ్చారు. నెడితే కూలిపోయే ఇందిరమ్మ ఇళ్ళను దళితులకిచ్చారు.

మత్స్యకారులను వివిధ పేర్లతో సముద్ర తీరంనుండి గెంటివేస్తున్నారు. వారి జీవనం ధ్వంసమైంది. ప్రత్యేక ఆర్థిక మండళ్ళపేరుతో నెట్టివేస్తే రోడ్లప్రక్క బ్రతుకులీడుస్తున్నారు. దళితులకు కనీసం స్మశానాలు లేక విలవిల్లాడుతున్నారు.

పరవాడ ఫార్మా కాలుష్యానికి వ్యతిరేకంగా మత్స్యకారుల ఆందోళన; నాగార్జునా అగ్రోకెమికల్స్ నిలిపివేత; ప్రత్యేక ఆర్థికమండళ్ళకు కేటాయించిన భూములను దున్నటం; సోంపేట, కాకరాపల్లి ఆందోళనలు....ప్రజలు అనివార్యంగా భూమికోసం ఆందోళనకు సిద్ధమౌతున్నారు.

వీరివెనుక ఏ నగ్జలైట్ పార్టీలేదు. ప్రజలు వారి అవసరాలమేరకు వారు సాయుధలౌతున్నారు. మనం చెయ్యాల్సింది-సరైన సామాజిక, రాజకీయ విశ్లేషణ చేసి వారికి అందించటమే. ఏ రాజకీయ పార్టీ కూడా సాయుధులు కండి అని చెప్పాల్సిన అవసరంలేదు.

దళితులపై జరిగిన దాడులలో కేసులు నమోదు చేయించటానికే పెద్దపెద్ద ఉద్యమాలు చేయాల్సివస్తోంది. దళితులకు ఎవ్వరూ రక్షణ ఇవ్వగలిగిన వారులేరు. దళితులు చనిపోయిన తర్వాతనే మేమూ వెళ్తున్నాం. రెండుగ్లాసుల పద్ధతి వద్దన్నందుకే, మీతో సమానంగా తెల్లబట్టలు కట్టుకుంటామన్నందుకే, మీ వీధిలో సైకిల్‌పై నుండి దిగబోమన్నందుకే, మీ ఎదురుగా చెప్పులు చేతిలో పట్టుకోబోమన్నందుకే నరమేధం సాగుతున్నది. ఒక ఎకరా భూమి దక్కుతుందని కమ్యూనిస్టు పార్టీలు ఇచ్చే పిలుపు నమ్మకం కలిగించలేకపోయింది. దళితుల, ఆదివాసీల గుడిశలపై ఎగరాల్సిన ఎర్రజెండా కమ్మ, రెడ్డి భవంతులపై ఎందుకు ఎగురుతున్నది?

దళితులారా, మీకు మీరే రక్షణ. దండకారణ్య ఆదివాసీ మీకు దిక్సూచి. వారివద్ద సాంప్రదాయకంగా వుండే విల్లంబే క్రూరమృగాలనుండి, పోలీసులనుండి వారికి రక్షణ.

పాలకులు - కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న సందర్భాలలో దళితుల, నిరుపేదల వలసలు పెరిగిపోతున్నాయి. దళితులు తమ సాంప్రదాయక ఆయుధాలను వదలివేస్తున్నారు. కొడవళ్ళు వదలిపెట్టవద్దు. వాటిని మీ బొడ్లలో దోపుకోండి. కర్రులు, నాగళ్ళు మీ వెంట వుంచుకోండి. అవే మీకు రక్షణ. చెప్పులు కుట్టే ఆరె, తోలుకోసేకత్తి మీదగ్గరే వుంచుకోండి. అగ్రకుల దురహంకారులు దాడులకొస్తే మీ ప్రాణాలను మీరు రక్షించుకోగలిగినప్పుడే మావోయిస్టులనుండి రైతుకూలీసంఘాల వరకూ మీకు అండగా నిలుస్తాయి. దండకారణ్య ఆదివాసీలే దిక్సూచి అని చెబుతున్నాను.

వివిధ సంఘాల, ప్రతినిధుల వేదికపైనుండి తన అభిప్రాయాలు తెలియజేసే అవకాశం కల్పించినందుకు రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కా॥దుడ్డు ప్రభాకర్ తన ఉపన్యాసం ముగించారు.



'జనశక్తి' పత్రికా సంపాదకులు డా॥ పి. జస్వంతరావు తన ప్రసంగంలో 'అణచబడ్డ దళితులంతా తిరగబడండి' అనేది ఈనాడు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నదన్నారు. 'తరిమెల నాగిరెడ్డి తన ప్రఖ్యాత కోర్టు ప్రకటన కోసం 1972లో ఆరు నెలల కాలంలో దేశవ్యాపితంగా దళితులపై జరిగిన, జైలులో అందుబాటులోకొచ్చిన పత్రికా వార్తలను పేర్కొంటేనే 20 పేజీలు అయింది. ఈనాటికీ నెలకు రెండుసార్లు పత్రికలో క్లుప్తంగా రాస్తున్నా రెండు పేజీలకు తక్కువగాకుండా వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంకన్నా తెగబడి, తిరగబడాల్సిన అవసరం మరింతగా ఎందుకు పెరుగుతున్నదో తారకంగారు వివరించారు.

ఒకనాడు శ్రీశైలం, నాగార్జునసాగర్ మునక బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండానే భూములు గుంజుకున్నారు. ఈనాడు ఆవిధంగా భూములు గుంజివేసుకోవటానికి ప్రతిఘటన పెరుగుతోంది.

కులవివక్ష వ్యతిరేక పార్టీలుగా ఉనికిలోకివచ్చిన తమిళనాడులోని ఏఐడిఎంకె, డిఎంకె పార్టీల పాలనలో దళితులకు రిజర్వు అయిన కారణంగా మాత్రమే అనేక పంచాయితీలకు ఎన్నికలు జరపటంలేదు. హర్యానాలో పరువుపేరిట దారుణ హత్యాకాండ సాగిపోతున్నది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో దళితులపై దాడులు పెరుగుతున్నాయి.

భారత సమాజంలో కులవ్యవస్థ వారసత్వంగా ఘనీభవించింది. దీనికి మూలమైన ఉత్పత్తి సంబంధాలను రద్దుచేయకుండా కులవ్యవస్థ అంతరించదు. కులమనేది 'శ్రమవిభజనేకాదు-శ్రామికుల విభజన' అని అన్నాడు అంబేద్కర్. విస్తృతంగా కులాంతర వివాహాలు జరగాలన్నాడు.

కమ్యూనిస్టు పార్టీ పీడిత ప్రజలను ఐక్యం చేసేందుకు వారి మధ్య విభజనను సమన్వయపరిచే కృషి, కులాంతర వివాహాలు నిర్వహించటంతోపాటు, కులనిర్మూలనోద్యమాన్ని ప్రబోధించిన సంస్కర్తలను విస్తృత ప్రచారంచేసింది. వ్యవసాయకూలీలు, రైతాంగాన్ని సమీకరించి వర్గపోరాటాలు నడిపింది.

కులం సమస్యను ఆర్థిక సమస్యగా మాత్రమే పరిగణించటంలేదు. ఇది భూమి సమస్య మాత్రమేకాదు, దళితుల హక్కుల, ఆత్మగౌరవ సమస్య కూడా. దళితులపై దాడికి వచ్చే వారెవరనే దానితో నిమిత్తంలేకుండా, దాడిని నిర్ద్వంద్వంగా ప్రతిఘటించాల్సిందే. దానికి తగిన పోరాట మార్గాలనెంచుకోవలసిందే. ప్రభుత్వ మిగులు మునక భూమిని దళితులకు పంచాలని డిమాండ్ వచ్చినపుడు లక్షింపేట పేదలందరికీ పంచాలనటం సరికాదు.

కులవ్యవస్థను బలహీనపరిచే స్వతంత్ర పెట్టుబడిదారీ సంబంధాలు మనదేశంలో అభివృద్ధి చెందనీయకుండా భూస్వామ్య వ్యవస్థను తన సామాజిక పునాదిగా చేసుకొని సామ్రాజ్యవాద పెట్టుబడి దేశజీవ నాడులన్నింటినీ పట్టిపల్లారుస్తున్నది.

కులవివక్ష, అంటరానితనం, రెండుగ్లాసుల విధానాలను వ్యతిరేకిస్తూ సంఘటితమౌతున్న దళితులకు అండగా నిలవాలి. సరైన దిశగా మార్గదర్శకత్వం వహించినపుడే ప్రతిఘటించటం సరైన మార్గంలో సాగుతుంది. ఈ వ్యవస్థ మార్పుతోనే వారి విముక్తి ముడిపడి వుంది. ఈ వ్యవస్థ మార్పుకోసం పోరాటం సాగించాలనే రాజకీయ చైతన్యాన్ని వారిలో పెంపొందించటం అవసరం.

దళితులకు ఆత్మగౌరవాన్ని దక్కనీయగూడదు, దళితులకు భూమి దక్కనీయకూడదనే దానిని అడుగడుగునా ఎదుర్కోవాలి. ప్రతి సంఘటనా నిర్దుష్ట రాజకీయ, ఆర్థిక, సామాజిక కోణాలతో ముందుకు వస్తుంది. ఏ సందర్భంలో ముందుకొచ్చిన కోణాన్ని ఆ సందర్భంలో ప్రధానం చేసుకొని మిగతా వాటితో సమన్వయంతో పోరాటం సాగించాలని కా॥ జస్వంతరావు తన ఉపన్యాసంలో పేర్కొన్నారు.



ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥గుర్రం విజయ కుమార్‌తన ప్రసంగంలో గతంలో దళితులపై సాగిన కొన్ని దాడులను ప్రస్తావించారు. 'కీలవేన్మణిలో ఆత్మ గౌరవంతో, అధిక వేతనం కోసం కలిసికట్టుగా దళితులు ఉద్యమించటాన్ని సహించ లేకే భూస్వాములు మూకుమ్మడి హత్యాకాండకు పాల్పడ్డారు. నెల్లూరుజిల్లా దామరమడుగులో రెడ్డి భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడినందుకు దాడి జరిగింది. కమ్యూనిస్టుపార్టీ- దళితులపై, వ్యవసాయకూలీలపై దాడులకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా నిరంతరం స్పందిస్తూ, పోరాడుతూనే వస్తున్నది. పరిష్కారం ఎక్కడ? ఈనాడు తెగించిన వారి ఆగ్రహం అనివార్యమౌతున్నది.

పాతగుంటూరుజిల్లా-ఇంకొల్లు మండలం-భీమవరం గ్రామ సర్పంచ్ దళితుడు. తనకు వున్నంతలో పందిరివేసి, కూతురి పెళ్ళి ఘనంగా చేయబూనుకోవటాన్ని కమ్మపెత్తందారీవర్గం సహించలేక అప్పటికప్పుడే ఆతని ఇంటిపై ఘోరమైన దాడిచేశారు. ఆనాడు కూడా అధికార కాంగ్రెస్‌పార్టీ, అందులోని దళిత నాయకులెవరూ దీనిని ఖండించలేదు. కంచికచర్ల కోటేశు సజీవదహనం, కారంచేడు మారణకాండ.....ఇలా దాడులు అవిచ్ఛిన్నంగా సాగుతున్నాయి. కారంచేడులో రామానాయుడు పంచాయితీ ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో పేదవాడి చేతిలో ఓటమిపాలై గ్రామం విడిచిపెట్టాడు. కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన తర్వాతే ఈ దాడుల ఉధృతి తీవ్రమైంది.

ఆర్థికంగా, సాంఘికంగా అసమానతలను సత్వరం తొలగించకుండా ఇదేవిధంగా కొనసాగితే ఈ ప్రజాస్వామ్య సౌధాన్ని దళితులే ధ్వంసం చేస్తారని అంబేద్కర్ చెప్పాడు. లక్షింపేటలో తెగిపడ్డ శిరస్సులు అడుగుతున్నాయి. దళితులు, ప్రజాతంత్రశక్తులు, కమ్యూనిస్టు, విప్లవశక్తులు సమైక్య ఉద్యమం చేయమని! లేకుంటే ఇవే సంఘటనలు తిరిగి తిరిగి పునరావృత మౌతాయంటూ, వీటిని ఎదుర్కోవటానికి సమైక్యంగా సాగుదామంటూ కా॥విజయకుమార్ తన ప్రసంగం ముగించారు.



కా॥ ఎస్. ఝాన్సి తన ముగింపు ఉపన్యాసంలో సదస్సుకు హాజరై ప్రసంగించిన ఉపన్యాసకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. 'దళితుల, ఆదివాసీల భూమి సమస్య, ఆత్మగౌరవ సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ ఆందోళనోద్యమాలు నిర్మిస్తూవస్తున్నది. శ్రీకాకుళ గిరిజనోద్యమం తర్వాత ప్రభుత్వం 1/70 చట్టం చేసింది. అయినప్పటికీ, 8లక్షల ఎకరాల భూములు గిరిజనేతరుల చేతుల్లో వున్నాయంటూనే, వాటిని పంచటానికి మాత్రం ప్రభుత్వం పూనుకోవటల్లేదు, పూనుకోదనీ స్పష్టమౌతున్నది.

విశాఖజిల్లా మాడుగుల మండలంలో దళితులను కొండపోరంబోకు భూమిని సాగుచేసుకోనీయకుండా వెలమ, కాపుదొరలు అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తూవస్తున్నారు. ఆ భూమిని రిజర్వు ఫారెస్టుగా మార్పించి రాజ్య యంత్రాంగం ద్వారా ఆ భూములనుండి గెంటివేస్తున్నారు. లక్షింపేటలోలాగా కక్షగట్టి దాడిచేసే రూపంలో కాకుండా, దళితులలో నోరుగల వారిని ప్రలోభపరుస్తూ, అత్యంత ఆర్భాటంతో అంబేద్కర్ జయంతులు జరిపే పేరిట వారిని లోబరుచుకొని దళితుల భూమి సమస్యను దెబ్బతీయాలని చూస్తున్నారు. ఇలాంటి సమస్యలనూ ఎదుర్కొంటున్నాం.

శ్రీకాకుళంజిల్లా - పాలకొండ ప్రాంతంలో అంటరానితనం చాలా తీవ్రంగా వుంది. లక్షింపేటలో దళిత మహిళా సర్పంచ్, పంచాయితీ సమావేశాల్లో నిలబడే వుండేంతగా వివక్షత నెదుర్కొంది. రాజాం నియోజకవర్గాన్ని దళితులకు రిజర్వుచేయటమే ఈ దాడులకు కారణమని ఓ విలేఖరి విశ్లేషించాడు. తెలుగుదేశం, కాంగ్రెస్, బిజెపి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలన్నీ ఈ ఫ్యూడల్ దురహంకారానికి ప్రాతినిధ్యం వహించేవే.

లక్షింపేటకు పార్వతీపురం 40 కి॥మీ దూరంలో వుంది. ఇదే కాపు దురహంకారులు 1999 నవంబర్ 4న దుగ్గేరు గిరిజన గ్రామాలపై హంతకదాడికి పాల్పడ్డారు. రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సంఘటితమైన గిరిజనులకు - దాడిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చాము. కాపుకుల దురహంకారులు పేద ఆదివాసీ కూలీలను వెంటబెట్టుకొచ్చి ఈ దాడి చేయించారు. గిరిజనుల తిరుగుదాడి ప్రారంభం కావటంతో వారంతా చేతులెత్తి మొక్కుతూ, వరసలు పెట్టి పిలుస్తుంటే, 'ఈ వరసలు మీకు ఇప్పుడు గుర్తొచ్చాయా' అంటూనే వారిని తరిమికొట్టారు. ఆరోజున ఆ ప్రతిఘటన జరగకుంటే 20-25మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయేవారు. లక్షింపేటకంటే దారుణం మరొకటి చరిత్రలో జరిగివుండేది. దారితప్పి శత్రుశిబిరంలో చిక్కుకు పోయిన మా కామ్రేడ్ జెన్ని తిరుపతి ఈ ఘటనలో అమరుడయ్యాడు.

పనసభద్రలో దళితులకు భూమి పంపిణీచేస్తాం, గిరిజనులకు ఇవ్వబోమని ప్రభుత్వాధికారులు చెప్పారు. పేదవర్గాలను ఒకరికొకర్ని శత్రువులుగా నిలిపే పాలకుల ఈ వైఖరిని ఎండగడ్తూ ఆందోళన సాగించినందుకు రైతుకూలీసంఘం కార్యాలయంపై పోలీసుల దాడులను ఎదుర్కొన్నాం.

నిరుపేదలుగా వున్న వృత్తి పనివారలను సంఘటిత పరచాలి-వారి సంసిద్ధతను పెంచాలి. ఇది ఆలస్యం అయినకొద్దీ ఎన్నో చుండూరులు, లక్షింపేటలు జరుగుతుంటాయి.

వాన్‌పిక్‌కు వ్యతిరేకంగా రైతులు, కూలీలను సంఘటితంచేసి ఉద్యమించాము. బొజ్జాతారకంగారితో కలిసీ కార్యక్రమాలు చేపట్టాం. అనేక కేసులను ఎదుర్కొన్నాం. ఈనాడు పాలకులు తమ ముఠా గొడవలలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈనాటికీ ఆ భూములన్నింటినీ పేదలకు తిరిగి పంపిణీచేస్తామని ప్రకటించలేదు. దీనికై రైతు, కూలీలు ఉద్యమించాలి. కరువు విలయతాండవం చేయబోతున్నది. దీనికి ఎక్కువగా పేదలు, దళితులు, గిరిజనులు మొదటి బాధితులుగా వుంటారు. దోపిడీచేస్తున్న వర్గం సంఖ్యరీత్యా తక్కువే. దానికి అర్థ, అంగ, అధికార బలంవుంది. దోపిడీకి గురయ్యేవారు అధికులే. కాపులు పేదవారైనా హత్యాకాండలో పాల్గొన్నవారు కఠినంగా శిక్షింప బడవలసిందే అనే వైఖరి తీసుకున్నాం.

రైతుకూలీసంఘం పనిచేస్తున్న ప్రతిచోటా పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం ఒకరిని మరొకరికి-ప్రజలలో ప్రజలకు పోటీపెడ్తున్నారు. ఎన్నెన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారు. ఈ కుట్రలను ఓడించి, సమస్యల పరిష్కారంకోసం సంఘం వుండాలి. ప్రజల్ని ముందుకు నడపడానికి సంఘం అవసరంవుంది. గిరిజనులను, దళితులను-సాంప్రదాయక ఆయుధాలను వదలద్దు అని చెపుతున్నాం. ఆత్మగౌరవానికి, భూముల సాధనకు ఇవి తప్పదని విద్యావంతం చేస్తున్నాం.

దళితులకు ఆత్మగౌరవం, భూమిపై హక్కుకోసం; ఆదివాసులకు అడవిపై హక్కుకోసం; మత్స్యకారులకు సముద్రంపై హక్కుకోసం డిమాండ్ చేస్తూ మనందరం ఆ కర్తవ్యంలో నిమగ్నమవ్వాలని పిలుపునిస్తూ కా॥ఝాన్సీ సదస్సును ముగించారు. సదస్సులో ప్రజాకళాకారులు లక్షింపేట దళిత అమరులపై పాటలు, దళితుల సమస్యలపై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

లక్షింపేట దళితులపై హంతకదాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించటంతోపాటు, లక్షింపేట దళితులకు 250 ఎకరాల మిగులు భూములపై హక్కు కల్పించాలని నినాదాలుచేస్తూ-సదస్సు ముగిసిన అనంతరం రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో స్థానిక **సుందరయ్య విజ్ఞానకేంద్రం నుండి ప్రదర్శన** జరిగింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుండి హాజరైన 500మందికి పైగా ప్రతినిధులు బ్యానర్లు, జెండాలు చేబూని వియస్‌టి మీదుగా ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌వరకు స్ఫూర్తిదాయకంగా ప్రదర్శన నిర్వహించారు. రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.)అధ్యక్ష కార్యదర్శులు కా॥ఎస్.ఝాన్సి, కె.కోటయ్య; 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి' కన్వీనర్ కా॥ బొజ్జా తారకం, కె.ఆర్. చౌదరి, విజయకుమార్ తదితరులుఅగ్రభాగాన ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రజాకళాకారులు గజ్జెకట్టి, డప్పులతో పాటలు పాడుతూ ప్రజలను ఆకట్టుకున్నారు.



'అణచబడ్డ దళితులంతా తిరగబడండి' పుస్తకావిష్కరణ చేస్తున్న కా॥ బొజ్జా తారకం; వేదికపై ఇతర వక్తలు

# ‘దళితులు భూమికోసం-ఆత్మగౌరవం కోసం సాగించే పోరాటాలు విడివిడి అంశాలుకావు; కలగలిపి సాగించే పోరాటానికి అవి రెండుపార్శ్వాలు’

## రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర సదస్సులో వక్తల ఉద్ఘాటన

సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ బొజ్జా తారకం; వేదికపై కా॥ ఝాన్సి, కె.ఆర్. చౌదరి, జస్వంతరావు, విజయకుమార్, దుడ్డు ప్రభాకర్, కోటయ్య; సదస్సుకు హాజరైన ప్రతినిధులు; ప్రదర్శన అగ్రభాగం




**హైద్రాబాదు, 14-7-12 :**

**‘లక్షింపేట** దళితన్నలు చిందించిన రక్తం- పీడిత, దళిత ప్రజానీకం ముందుంచుతున్న కర్తవ్యం’- కేంద్ర అంశంగా రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జులై 14వ తేదీన రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది.

రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వక్తలను సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ కిషోర్‌బాబు వేదికపైకి ఆహ్వానించారు.

లక్షింపేట పెత్తందారీ కుల దురహంకారుల క్రూర హత్యాకాండలో నేలకొరిగిన నివర్తి సంగమేశు, నివర్తి వెంకటి, బోరాడ సుందరరావు, చిత్తడి అప్పుడు, బొడ్డూరి పాపయ్యలతోపాటు, 2 నెలల క్రితం ఇదే పెత్తందారుల దాడులకు గురై కనుమూసిన రావుడమ్మలకు సదస్సు నివాళులర్పించింది.

ఇటీవల ఛత్తిస్‌ఘడ్ రాష్ట్రం - సర్కెగూడ ప్రాంతంలో ఎదురు కాల్పుల పేరిట సిఆర్‌పిఎఫ్ బలగాలు సాగించిన హత్యాకాండలో మరణించిన 18 మంది ఆదివాసులకు సదస్సు జోహార్లర్పించింది.

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం-ఇదే-రోజున-జులై 14న-వినాశకరమైన సోంపేట థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా నిలిచిన ప్రజలపై పోలీసు బలగాలు సాగించిన కాల్పులలో మృతిచెందిన ముగ్గురు మత్స్యకారులను సదస్సు ఈ సందర్భంగా సంస్మరించుకుంది.

వీరందరి స్మతిలో కా॥ ఝాన్సి ప్రతిపాదించిన సంతాప తీర్మానం అనంతరం సదస్సుకు హాజరైన ప్రతినిధులందరూ లేచినిలబడి మౌనం పాటించారు. అగ్రకుల ఆధిపత్య వర్గాలు, రాజ్యం సాగిస్తున్న హత్యాకాండకు వ్యతిరేకంగా ముక్త కంఠంతో నినదించారు.

అనంతరం కా॥ఎస్.ఝాన్సి తన అధ్యక్షోపన్యాసంలో లక్షింపేట ఘటన- పూర్వాపరాలను, ప్రస్తుత సదస్సు ప్రాధాన్యతను దృష్టికి తీసుకువచ్చారు. ‘స్వాతంత్ర్యానంతరం గత 65 సం॥లుగా అనేక దాడుల పరంపరను చూస్తున్నాం. తెగబడి రాజ్యం అండతో సాగిస్తున్న దాడులివి. కారంచేడు, చుండూరు, వేంపెంట...ఈ వరుసలోనిదే లక్షింపేట. ఇంతటి తీవ్రమైన దాడి ఎలా చేయగలిగారు? కాంగ్రెసు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా వున్న బొత్స సత్యనారాయణ అండదండలతో, జిల్లాపోలీసుల దన్నుతో దళితులపై కుల దురహంకారులు విచక్షణారహితంగా సాగించిన బీభత్సమైన దాడి ఇది!

అగ్రకులతత్వంతో కాపులు సాగించిన లక్షింపేట దాడిని దళితులుకూడా ఊహించలేదు. ఉదయాన్నే అందరూ సద్ది తింటూ పనులకు సిద్ధమవుతుండగా జరిగిన దాడి ఇది!

బరిశలతో రెండుకళ్ళల్లో పొడిచారు. కళ్ళల్లో కారంకొట్టి బాంబులు వేశారు. సుందర్రావును బండరాయితో మోది క్రూరంగా చంపేశారు. ఈ దాడి స్వభావం ఏమిటి? కారణాలు ఏమిటి? అనేవి వెను వెంటనే బయటకు రాకుండా మీడియా వ్యవహరించింది. వివాదాస్పద భూమిలోకి దళితులు వెళ్ళేక్రమంలో ఇరువర్గాల నడుమ జరిగిన ఘర్షణ అని, కాపుకులస్థులపై దళితులు బాంబులేయటంతో జరిగిన ఘర్షణ అనీ అవాస్తవాలనే ముందుగా ప్రచారం గావించింది. కానీ క్రమంగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దళిత, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టుపార్టీలు, పెద్దఎత్తున ప్రచారం జరిపినతర్వాతనే వాస్తవాలు ప్రపంచానికి వెల్లడయ్యాయి.

దళితులు, పేదప్రజలు తమకు భూమి కావాలని ప్రభుత్వాన్ని అడిగితే సంవత్సరాల తరబడి కాలయాపన చేసి, మొండిచేయి చూపటం మినహా భూమి పంపకం చేయటం లేదు-చేయదుకూడా.

రానున్న కాలంలో రాజ్యయంత్రాంగ దన్నుతో, ఆధిపత్య కులదురహంకారంతో దళితులపై మరిన్ని దాడులు జరగనున్నాయని, దీనిపై జాగరూకతతో వుంటూ దళితుల భూమి సమస్య పరిష్కారానికి, దళితులపట్ల వివక్ష, అంటరానితనాలకు వ్యతిరేకంగా అందరం సమైక్య పోరాటానికి సిద్ధంకావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని కా॥ ఝాన్సి తన అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు.

**‘అణచబడ్డ దళితులంతా తిరగబడండి’ -పుస్తకావిష్కరణ**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పీడిత ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ, భూమిహక్కు, ఆత్మగౌరవంతో జీవించే హక్కు సాధనకోసం దళితులు, ఆదివాసులు, మహిళలు - పీడిత ప్రజలను పోరాటోన్ముఖుల్ని చేసే క్రమంలో వివిధ సందర్భాలలో చేసిన ప్రకటనలు, కరపత్రాలు, వ్యాసాలు, కా॥ తరిమెల నాగిరెడ్డి ప్రఖ్యాత గ్రంథం ‘తాకట్టులో భారతదేశం’లోని ‘తెగించిన ఆగ్రహం అనివార్యం’ అనే భాగాలతో కూడిన సంకలనాన్ని ‘అణచబడ్డ దళితులంతా తిరగబడండి’ పేరున రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) ప్రచురించిన 144 పేజీల పుస్తకాన్ని హైకోర్టు సీనియర్ న్యాయవాది, ‘లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి’ కన్వీనర్ కా॥ బొజ్జా తారకం ఆవిష్కరించారు.

అనంతరం ఆయన ప్రసంగిస్తూ లక్షింపేట దళితులపై దాడులు-హత్యాకాండ వంటివి ఎందుకు జరుగుతున్నాయో వాటి కారణాలు-పరిష్కారాలను చర్చించే ఉద్దేశ్యంతో రైతుకూలీ సంఘం ఈ సదస్సును నిర్వహిస్తూ, ఈ సందర్భంగా ప్రచురించిన పుస్తకాన్ని తన చేతులమీదగా ఆవిష్కరింపజేయటం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

దేశంలో దళితులపై గతకాలంలో సాగిన దాడులు-హత్యాకాండ, వాటిపై ఆనాడు రైతుకూలీసంఘం ప్రచురించిన వ్యాసాలు, **(తరువాయి 6వ పేజీలో)**

# లక్షింపేట దళితుల డిమాండ్ల పరిష్కారానికై జులై 4న విజయవంతమైన ‘ఛలో కలక్టరేట్’

*(లక్షింపేట దళితులకు సంఘీభావంగా, వారి డిమాండ్ల పరిష్కారంకోసం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు కా॥ బొజ్జా తారకం గారు కన్వీనర్‌గా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) భాగస్వామ్య సంస్థగా వివిధ దళిత, కులనిర్మూలనా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన ‘లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి’ వివిధ కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తూ వస్తున్నది.*

*ఈ కమిటి పిలుపు మేరకు జులై నాలుగవ తేదీన రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాలలో ప్రధానంగా లక్షింపేటలోని ప్రభుత్వ భూమి 250 ఎకరాలనూ లక్షింపేట దళితులకు కేటాయించాలనే డిమాండ్‌తో ‘ఛలో కలెక్టరేట్ ’ కార్యక్రమం నిర్వహించారు. అన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండంను అందజేశారు. అందినమేరకు రిపోర్టులను సంక్షిప్తంగా ప్రచురిస్తున్నాం -సంపాదకుడు)*

**హైదరాబాదు :**

**జులై 4న** ‘లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి’ ఆధ్వర్యంలో 200 మందితో స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి వియస్‌టి, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ మీదుగా ఇందిరా పార్క్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం ఇందిరాపార్కు వద్ద జరిగిన సభలో సంఘీభావ కమిటి కన్వీనర్ కా॥ బొజ్జా తారకం మాట్లాడుతూ లక్షింపేటలో మడ్డువలస రిజర్వాయరు మిగులు మునక భూములు 250 ఎకరాలను దళితులకు కేటాయించాలని; కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సులు, సుప్రీంకోర్టు తీర్పులకనుగుణంగా భూమి దళితుల స్వాధీనమయ్యేంత దాకా ఐక్య పోరాటాల్ని సాగించాలన్నారు.

అనంతరం సంఘీభావకమిటి ప్రతినిధి బృందం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లను కలిసి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్రకార్యదర్శి కా॥ కె. కోటయ్య, కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కా॥ దుడ్డు ప్రభాకర్, స్త్రీవిముక్తి సంఘటన సహాయ కార్యదర్శి కా॥ ఎం. లక్ష్మి, చైతన్య మహిళా సంఘం నాయకులు జయమ్మ, ప్రజాకళామండలి నాయకులు కోటి, దళిత స్త్రీ శక్తి నాయకులు గడ్డం ఝాన్సి, టియుఎఫ్ నాయకులు విమల తదితర దళిత, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని లక్షింపేట దళితుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేశారు.

**శ్రీకాకుళం :**

‘లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటి’ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద జరిగిన ధర్నాను రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సి ప్రారంభించి ప్రసంగించారు. శ్రీకాకుళంజిల్లాలో ఈనాటికీ పెద్దఎత్తున కొనసాగుతున్న కులవివక్ష, అంటరానితనం, రెండుగ్లాసుల విధానం వంటి వాటికి వ్యతిరేకంగా దళిత, విప్లవ, కమ్యూనిస్టు పార్టీల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రజా ఐక్యకార్యాచరణ చేపట్టి నిర్వహించటం ద్వారా, దళితులకు భూమిపై హక్కు సాధించటం ద్వారా లక్షింపేట వంటి నరమేధాలకు అడ్డుకట్ట వేయగలుగుతామన్నారు.

ఈ ధర్నాలో ఇంకా టి. అరుణ (రైతుకూలీసంఘం), పాపారావు (ఓపిడిఆర్), భానుమూర్తి (ఏపిటిఎఫ్), మిస్క కృష్ణయ్య(కుల నిర్మూలనా పోరాట సమితి), మంద కృష్ణ (ఎంఆర్‌పిఎస్) తదితరులు పాల్గొని లక్షింపేట దళితులకు సంఘీభావం ప్రకటించారు. 700 మంది ప్రజలు, వివిధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్న ఈ ధర్నాకు కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటి ప్రతినిధి ధనేష్ అధ్యక్షత వహించారు.

**విజయనగరం :**

దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించటానికి అవసరమైన భూమి సమస్యను పరిష్కరించకుండా, దళితులపై హంతకదాడులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ దుర్మార్గాన్ని నిరసిస్తూ జులై నాలుగున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సంఘీభావ కమిటి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.

ధర్నాకు ముందుగా 150 మంది రైతుకూలీ, శ్రామిక, దళిత ప్రతినిధులతో రైల్వేస్టేషన్ నుండి ప్రదర్శన నిర్వహించారు. పోలీసుల మోహరింపుల నడుమ 3 గంటల పాటు ధర్నా కొనసాగించారు. దళితుల సమస్యల పరిష్కారానికై చేసే నినాదాలు, ప్రజాకళాకారులు పాడిన పాటలతో ఆ ప్రాంగణమంతా హోరెత్తింది. కలెక్టరు తరఫున డిఆర్‌ఓ వెలుపలకు వచ్చి మెమోరాండం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ ఊయక ముత్యాలు, జిల్లా కార్యదర్శి **(తరువాయి 5వ పేజీలో)**

**వెలువడింది**




**అణచబడ్డ దళితులంతా తిరగబడండి**

పేజీలు : 144

**వెల : రు. 50/-**

కాపీలకు :

**మైత్రీబుక్‌హౌస్**

జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

**Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**
**and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2**
**Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010**